ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

1

ఆదివారం 15 జూన్ 2025



బండలున్న చోట షాట్ క్రీటింగ్ చేస్తూ..



లైనింగ్ పూర్తయిన హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచ్ కెనాల్

లైనింగ్‌తో కృష్ణమ్మ పరుగులు

- శరవేగంగా హంద్రీ-నీవా పనులు
- 35-40 శాతం కాంక్రీటు లైనింగ్ పూర్తి
- కాలువ చివరి వరకు జల ప్రవాహం
- రెండు నెలల్లో పూర్తికి ప్రభుత్వం కసరత్తు

మదనపల్లె, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతానికి వరప్రదాయినిగా చెప్పుకునే హంద్రీ-నీవా లైనింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పనులన్నీ పూర్తయితే కాలువలో కృష్ణమ్మ పరుగులు పెట్టనుంది. కాలువ చివరి వరకు కృష్ణాజలాలు తీసుకెళ్లాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా హంద్రీ-నీవా రెండో విడతలో అప్పటి టీడీపీ ప్రభుత్వం, ఇప్పటి కూటమి ప్రభుత్వం పనులు పూర్తి చేయగా, తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం హంద్రీ-నీవాను గాలికొదిలేసింది. ఈ క్రమంలో ఉన్న పనులను వదిలేసి రూ.5316 కోట్లతో గాలేరు-నగరి అనుసంధానం పేరుతో భారీ పథకాన్ని తెరపైకి తెచ్చింది. ఎక్కడా రైతులకు రూపాయి పరిహారం చెల్లించకుండా బలవంతంగా పనులు మొదలు పెట్టి రూ.1100 కోట్లు బిల్లుల రూపంలో పెద్దలు తినేశారు. అలాగే పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో కృష్ణమ్మ ముందుకు కదలడం లేదంటూ కాలువ విస్తరణ పేరుతో మరో రూ.1219 కోట్లతో టెండర్లు పిలిచింది. ఇలా అప్పటికే పూర్తయిన కాలువలో నీళ్లు తీసుకోకుండా అక్కడి అనంతపురం రైతులకు వదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తన హయాంలో పూర్తి చేసి, అప్పటికే పడమటి ప్రాంతానికి మూడుసార్లు నీరు పారించిన హంద్రీ-నీవాకు పూర్వవైభవం తేవడానికి అన్ని చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సుమారు రూ.900 కోట్ల వ్యయంతో లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఫిబ్రవరి నుంచి పనులు మొదలు పెట్టింది. ఇప్పటికే 35-40 శాతం పనులు చేపట్టగా, మిగిలిన పనులు అన్ని పరిస్థితులూ అనుకూలిస్తే జూలై చివరికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెళుతోంది.

శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం పట్నం నుంచి మొదలయ్యే పుంగనూరు బ్రాంచ్ కెనాల్ చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం అప్పినపల్లె వద్ద ముగుస్తుంది. 74 కి.మీ నుంచి 207 కి.మీ వరకు పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌లో కృష్ణమ్మ ప్రవహిస్తుంది. అలాగే కుప్పం బ్రాంచ్ కెనాల్ అప్పినపల్లె నుంచి మొదలై కుప్పం వరకు 123 కి.మీ. ప్రయాణంతో ముగుస్తుంది. పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్స్‌ను మూడు కంపెనీలు రీచ్‌లుగా విభజించి 25 ప్రాంతాల్లో పనులు చేపడుతున్నాయి. ఇందులో పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌లో 74 కి.మి-110 కి.మీ. రీచ్ పరిధిలో మూడు నుంచి నాలుగు ఏరియాలలో యంత్రాలు పనిచేస్తున్నాయి. అలాగే 110 కి.మీ., 150 కి.మీ., 150 కి.మీ., 165 కి.మీ., 165 కి.మీ., 180 కి.మీ., 180 కి.మీ., 195 కి.మీ., 195 కి.మీ. 207 కి.మీ. పరిధిలోని ఒక్కో రీచ్‌లో మూడు నుంచి నాలుగు ఏరియాలలో పనులు చేపడుతున్నారు. అలాగే కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో 0.కి.మీ., 66 కి.మీ., 66 కి.మి.,-123 కి.మి. రీచ్ వరకు పనులు చేస్తున్నారు. అలాగే పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ప్రారంభమయ్యే ముందుభాగం శ్రీసత్యసాయి జిల్లా నుంచి అనంతపురం వరకు 0 కి.మీ., 23 కి.మీ., 23 కి.మీ., 74 కి.మీ., రెండు ప్యాకేజీ (రీచ్) ఆరు ప్రాంతాల్లో పనులు చేపడుతున్నారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్ మొదలయ్యే 74 కి.మీ. నుంచి 165 కి.మీ. వరకు ఈఈ నీలకంఠ, 165 కి.మీ., 207 కి.మీ. వరకు ఈఈ సీఆర్ రాజగోపాల్ పర్యవేక్షిస్తున్నారు. అలాగే కుప్పం బ్రాంచ్ కెనాల్ 0.కి.మీ. నుంచి 123 కి.మీ. వరకు ఈఈ వెంకటేశ్వర్లు పనులు చేయిస్తున్నారు.



యంత్రంతో కాంక్రీటు వేస్తున్న కూలీలు

లైనింగ్‌తో లాభాలెన్నో...

హంద్రీ-నీవా లైనింగ్‌తో నీటి నష్టాలతో పాటు ప్రవాహం వేగం, కెపాసిటీ పెరగనుంది. ప్రధాన కాలువ నుంచి ఆఫ్‌లైన్‌లో మొదలయ్యే పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ప్రారంభంలో 800 క్యూసెక్కుల ప్రవాహం ఉండేలా డిజైన్ చేయగా, తర్వాత నాలుగు కిలోమీటర్ల పొడవున్న చెర్లోపల్లె రిజర్వాయర్ దిగువ భాగమైన కదిరి మండలం పట్నం నుంచి 380 క్యూసెక్కులు ఔట్‌ఫ్లోగా నిర్ణయించారు. అనంతరం అన్నమయ్య జిల్లాలో ప్రవేశించే పీటీఎం మండలంలో 200 క్యూసెక్కులు మించీ రాలేదు. తర్వాత మదనపల్లెకు కూడా ఒకానొక దశలో వంద క్యూసెక్కులకు పడిపోయింది. ఇక్కడి నుంచి పుంగనూరు, పెద్దపంజాణి మండలాల్లోకి ప్రవేశించేటప్పటికి 145 క్యూసెక్కులుగా డిజైన్ చేయగా, ప్రస్తుతం 289 కి.మీ.పై నుంచి 145 క్యూసెక్కుల నుంచి 282 క్యూసెక్కులకు పెంచుతూ కాలువను వెడల్పు చేస్తున్నారు. అలాగే తర్వాత కుప్పం బ్రాంచ్ కెనాల్ మొదలయ్యే అప్పినపల్లె వద్ద 260 క్యూసెక్కుల ప్రవాహం ఉండేలా, తర్వాత 20 కి.మీ. తర్వాత కుప్పం వరకూ 161 క్యూసెక్కులు సాగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే అప్పట్లో మట్టికాలువలో సాగిన నీటి ప్రవాహం ఆశించిన స్థాయిలో ముందుకు రాలేదు. లైనింగ్ పూర్తయితే 20 క్యూసెక్కుల తేడాతో పూర్తిస్థాయిలో కాలువ చివరి వరకు కృష్ణా జలాలు పారనున్నాయి.



హంద్రీ-నీవా కాలువ చదునులో బండను తొలగిస్తూ..

నీట్‌లో జయంత్‌రెడ్డికి 2278వ ర్యాంకు



తల్లిదండ్రులతో జయంత్‌రెడ్డి

మదనపల్లె టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ పరీక్ష (నీట్) ఫలితాల్లో మదనపల్లెకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయిలో 2278వ ర్యాంకు సాధించాడు. మదనపల్లె పట్టణానికి చెందిన కె.ప్రభాకర్‌రెడ్డి, శ్రావణి దంపతుల కుమారుడు కె.జయంత్‌రెడ్డి నీట్‌లో 720 మార్కులకు గాను 574 మార్కులతో జాతీయ స్థాయిలో 2278వ ర్యాంకు సాధించాడు. ఇటీవల విడుదలైన ఈఏపీ సెట్‌లో కూడా జయంత్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో అగ్రికల్చర్ విభాగంలో 48వ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. కాగా తండ్రి ప్రభాకర్‌రెడ్డి మదనపల్లె ఎంఈవోగా పనిచేస్తున్నారు.

ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల ధ్రువీకరణకు తుది అవకాశం

వేంపల్లె, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ఆధ్వర్యంలోని ట్రిపుల్ ఐటీలలో దరఖాస్తు చేసుకున్న ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల ధ్రువీకరణకు ఈనెల 16న తుది అవకాశం కల్పిస్తున్నట్లు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సండ్ర తెలిపారు.

2025-26 విద్యాసంవత్సరానికి క్యాప్, స్పోర్ట్స్, ఎన్‌సీసీ, బీఎస్‌జీ వంటి ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు 16వ తేదీ సోమవారం నూజివీడు క్యాంపస్‌లో సర్టిఫికెట్ల ధ్రువీకరణ ఉంటుందని తెలిపారు.

రక్తదాత వేణుకు సత్కారం



110 సార్లు రక్తదానం చేసిన వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న మంత్రి సత్యకుమార్

చిట్వేలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా చిట్వేలికి చెందిన డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్ 110 సార్లు రక్తదానం చేసిన సందర్భంగా అత్యుత్తమ పురస్కారం అందుకున్నారు. ప్రపంచ రక్తదాతల రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గుంటూరు భారతీయ విద్యాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ రామారావు, రెడ్‌క్రాస్ సొసైటీ సీఈవో ఏకే పరిదా తదితరులు వేణుగోపాల్‌ను సత్కరించి పురస్కారం అందచేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, డాక్టర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వేణు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



రాయచోటిలో జరిగిన యోగా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, ఆర్డీవో తదితర అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

రాయచోటిటౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యమే కాకుండా మానసిక ప్రశాంతత కలుగుతుందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. యోగాంధ్రలో భాగంగా శనివారం రాయచోటి పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన యోగా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ నరసింహకుమార్, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, పలువురు ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, రెవెన్యూ, మున్సిపల్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ప్రారంభించి వదిలేయకుండా దినచర్యలో భాగం చేసుకోవాలని తెలిపారు. కుటుంబ పెద్దగా ఉన్న వ్యక్తి యోగా చేస్తే వారి పిల్లలకు చిన్నప్పటి నుంచి అలవాటుగా మారుతుందని తెలిపారు. తద్వారా మీ ఆరోగ్యం, మీ కుటుంబం, సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులు, ప్రజలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

గుర్రంకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయంలో దాతలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని దానాలకన్నా రక్తదానం మిన్న

- పీలేరులో రక్తదానంపై అవగాహనా ర్యాలీ



రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు, మెమెంటోల బహూకరణ

పీలేరు రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని పీలేరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగవేణి తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పీలేరులో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు డాక్టర్లు, వైద్య సిబ్బందిచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడమంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడడమేనని అన్నారు. పీలేరులో రక్తనిల్వ కేంద్రం ప్రారంభించి 18 సంవత్సరాలు కావస్తోందని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు పలుమార్లు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాల ద్వారా 9850 మంది దాతల ద్వారా రక్తం సేకరించామని చెప్పారు. దీంతో మూడుసార్లు ఉత్తమ పురస్కార అవార్డులు అందుకోవడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా పలుమార్లు రక్తదానం చేసిన దాతలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు బహూకరించారు. కార్యక్రమంలో డాక్టర్ సరస్వతి, తలపుల, రేగళ్ల పీహెచ్‌సీల సిబ్బంది, పలువురు రక్త దాతలు పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న పసుపు 3

ఎకరాకు లక్ష రూపాయల ఆదాయం

కువైట్ నుంచి స్వదేశానికి రప్పించండి

- వీడియో ద్వారా మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేసిన కేవీ పల్లె మహిళ 3

నాటుసారా వదులుకోకపోతే జైలుశిక్ష తప్పదు

- ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ మధుసూదన్




ఎగువమేకలవారిపల్లె అటవీ ప్రాంతంలో నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న సూపరింటెండెంట్ మధుసూదన్

వాల్మీకిపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, విక్రయాలు స్వచ్ఛందంగా వదులుకోకపోతే జైలు జీవితం తప్పదని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ మధుసూదన్ హెచ్చరించారు. శనివారం వాల్మీకిపురం ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ పరిధిలోని వివిధ మండలాల్లో విస్తృత దాడులు నిర్వహించారు. వాల్మీకిపురం మండలంలోని ఎగువమేకలవారిపల్లెలో స్థానిక ఎక్సైజ్ అధికారులకు సైతం ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జిల్లా సూపరింటెండెంట్ మధుసూదన్ సిబ్బందితో కలిసి తానే స్వయంగా అటవీ ప్రాంతాలలో విస్తృత దాడులు చేపట్టారు. ఎగువమేకలవారిపల్లె అటవీ ప్రాంతంలో నాటుసారా బట్టీలను గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే కలికిరి మండలంలోని గోళ్లతోపు గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో నాటుసారా తయారీకి దాచిన వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన వెంకటమల్లయ్య, క్రాంతి అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసే దిశగా దాడులు చేయగా సంబంధిత వ్యక్తులు పరారయ్యారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ కొద్ది నెలలుగా నవోదయం కార్యక్రమాలతో నాటుసారా తయారీ విక్రయాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని, అయినా కూడా నాటుసారా తయారు చేస్తున్న వారు ఎంతటివారైనా ఇక ఉపేక్షించబోమన్నారు. ప్రభుత్వం ఎన్నో విధాల ఉపాధి కల్పన చేస్తున్నప్పటికీ నాటుసారా తయారీ, విక్రయాలు సాగిస్తున్నారని పట్టుబడితే కేసులు నమోదు చేసి పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ యల్లయ్య, సీఐ లత, ఎస్ఐ సుభాషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రూ.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



దొంగల అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర, సీఐ సత్యనారాయణ

మదనపల్లె టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు పోలీసుస్టేషన్‌లలో జరిగిన ఆరు దొంగతనాల్లో ఆరుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రూ.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ మహేంద్ర విలేకరులకు వివరాలు వెల్లడించారు. ముదివేడు పోలీసుస్టేషన్ పరిధిలో 2024-25 సంవత్సరాల్లో మూడు ఇళ్లలో, మదనపల్లె వన్‌టౌన్, టూటౌన్, తాలూకా పోలీసుస్టేషన్‌ల పరిధిలో 2025 సంవత్సరంలో మూడు ఇళ్లలో దొంగతనాలు జరిగాయన్నారు. ఈ ఆరు చోరీ కేసులపై సీసీఎస్ సీఐ, మదనపల్లె రూరల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో చోరీ కేసుల్లో కర్ణాటక, ఆంధ్రలో ముమ్మరంగా దర్యాప్తు చేయడంతో పాటు నిందితుల కోసం తీవ్రంగా గాలింపు నిర్వహించామన్నారు. శనివారం ఉదయం అంగళ్లు రోడ్డు చేనేతనగర్ బస్టాండు వద్ద ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరం అంగీకరించారని తెలిపారు. ఆరు ఇళ్లలో దొంగిలించిన 150 గ్రాముల బంగారు నగలు, 762 గ్రాముల వెండి వస్తువులు, రూ.5.28 లక్షల నగదును నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం రూ.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ చెప్పారు. నిందితుల్లో మదనపల్లె మండలం టీఎన్ఆర్ కాలనీకి చెందిన షేక్ మౌలాలి (52), కర్ణాటక రాష్ట్రం చింతామణి తాలూకాకు చెందిన ఎన్.శంకర (48), కురబలకోట మండలం నంది రెడ్డిగారిపల్లె పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన పాలెం నరసింహులు (45), మదనపల్లె మండలం కోటవారుపల్లె పంచాయతీ పాకాలవారిపల్లెకు చెందిన వి.నవీన్‌కుమార్ (30), తెట్టు పంచాయతీ చింతమాకులపల్లెకు చెందిన ఎ.విశ్వనాథరెడ్డి (65), గంగవరం మండలం మాడుగూరుకు చెందిన ఎన్.రమేశ్ (44)ను అరెస్టు చేశామన్నారు. రిమాండ్ నిమిత్తం వీరిని కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్, పీసీలు పి.హరి, శ్రీనివాసులు, వెంకటేశ్, శ్రీనివాసులు, శాంతకుమార్, ప్రేమ్‌కుమార్, బ్రహ్మేష్, రాజేష్, రెడ్డిశేఖర్, సిద్దేశ్వర్‌లను, సీసీఎస్ పోలీసులు నరసింహులు, శంకర్, రాఘవరెడ్డి, శివశంకర, దొరబాబు, చలపతిలకు రివార్డుకు రెకమెండ్ చేశామని డీఎస్పీ తెలిపారు.

నిందితుల నేర చరిత్ర

షేక్ మౌలాలిపై బి.కొత్తకోట పోలీసుస్టేషన్‌లో రెండు ఎర్రచందనం కేసులు ఉండగా, ఎన్.శంకర కర్ణాటక ఆర్టీసీ సర్వీసులో డ్రైవర్ కమ్ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. చోరీ సొత్తును కర్ణాటక రాష్ట్రంలో విక్రయించడంలో సిద్ధహస్తుడు. వి.నవీన్‌కుమార్ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలించిన కేసులో నిందితుడు, ఎ.విశ్వనాథరెడ్డిపై ముదివేడు పోలీసుస్టేషన్‌లో లిక్కర్ కేసు ఉంది.

ఆక్రమణలు తొలగించండి

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



బెంగళూరు బస్టాండులో మురుగునీటి కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం బెంగళూరు బస్టాండు ప్రాంతంలో కాలువలను ఆక్రమించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. శనివారం స్థానిక బెంగళూరు బస్టాండులో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు. అదేవిధంగా మురుగునీటి కాలువలపై ఆక్రమించి నిర్మించిన షాపింగ్ గదులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షం వస్తే మురుగునీటి కాలువలు నిండిపోతున్నాయని, ఆక్రమణలతో వర్షం నీరు వెళ్లేందుకు ఇబ్బందిగా మారి బెంగళూరు బస్టాండు అంతా కుంటలా మారిపోతోందన్నారు. దీనిపై సర్వే చేసి మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేయించాలని, ఆక్రమణలన్నింటిని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమీలను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నాగార్జునబాబు, టీడీపీ నాయకులు షంషేర్, బాబాఫక్ద్రీన్, జీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ



రాజగోపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, ముక్కా వరలక్ష్మి

రైల్వేకోడూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె మండలంలోని తల్లంవారిపల్లెలో బీజేపీ నాయకుడు రాజగోపాల్‌రెడ్డిపై వైసీపీ నాయకులు శుక్రవారం దాడి చేసి గాయపరిచిన విషయం విదితమే. శనివారం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను ఎమ్మెల్యే విప్ అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. కూటమి యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం



బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

వీరబల్లి, జూన్14(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కారమే ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ మండల సీనియర్ నాయకుడు రెడ్డెప్పరెడ్డి, రాంమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గడికోట రోడ్డులో బోరును టెంకాయ కొట్టి ప్రారంభించారు. కొత్తపేటలోని మసీదులో బోరు వేయగా నీరు పడ్డాయన్నారు.

అన్నదాత సుఖీభవకు వేలి ముద్రలు తప్పనిసరి

రైల్వేకోడూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అన్నదాత సుఖీభవ పథకానికి రైతుల వేలిముద్రలు తప్పనిసరి అని రైల్వేకోడూరు వ్యవసాయశాఖ అధికారి జి. సుధాకర్ తెలిపారు శనివారం ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి ఓటీపీలతో నమోదు కాదని, చేతివేలి ముద్రలు లేకుండా అన్నదాత సుఖీభవ వర్తించదని తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో వేలి ముద్ర నమోదు చేయించుకోవాలన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆడపూరు గ్రామంలో శనివారం ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువపత్రాలను తప్పక కలిగి ఉండాలన్నారు. హెల్మెట్లు తప్పక ధరించాలన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

పెనగలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెనగలూరులో ఈనెల 4 నుంచి ప్రారంభమైన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం జరిగిన వసంతోత్సవం, ధ్వజారోహణం కార్యక్రమాలతో వైభవంగా ముగిశాయి. 10 రోజుల పాటు ఐదుగురు భాగవతారణలచే హరికథ గానంతో పాటు ఐదు రోజులు అబ్బురపరిచే ఈవెంట్స్ సినిమా పాటలు, రికార్డింగ్ డ్యాన్స్ కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

క్రీడా మైదానాలు లేక ఆటలకు దూరం



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న క్రీడా మైదానం... ఆటల కోసం హద్దులు ఏర్పాటు చేయని దృశ్యం

సుండుపల్లె, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయి సౌకర్యాలను కల్పించామని, నాడు-నేడు ద్వారా సమూల మార్పులు తీసుకొచ్చామని గత ప్రభుత్వం ఐదేళ్లుగా ఊదరగొట్టింది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేక విద్యార్థులు ఆటలాడేందుకు ఇబ్బంది పడుతున్నారు. సుండుపల్లె మండలంలో 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. సుమారు 70 ప్రాథమిక పాఠశాలలు ఉండగా విద్యార్థులు బడి బయటకు వెళ్లి ఆడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.అరకొరగా ఉన్న క్రీడా మైదానాల్లో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. క్రీడా మైదానాల దుస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించాలని వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరమే

విద్యార్థులు విద్యతో పాటు ఆటలపై కూడా దృష్టి సారించాలని నిపుణులు చెబుతున్నారు. బాల్యంలోనే దేహదారుఢ్య, మానసిక ఉల్లాసానికి దోహదపడే ఆటలతో వారు ఆరోగ్యంగా ఎదిగే అవకాశం ఉంటుంది. ఇందుకు వ్యాయామ ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. వారికి సరైన సదుపాయాలను కల్పిస్తే మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ కనపర్చిన సందర్భాలు ఉన్నాయి. సమీప పొలాలు, ఖాళీ స్థలాల్లో ఆటలాడుతున్నారు. వీటన్నింటిపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలు మండలాల ప్రజలు కోరుతున్నారు.

సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

పభుత్వ బడుల్లో ఆట స్థలాల సమస్యను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఉన్న క్రీడా మైదానాలను సిద్ధం చేసి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూస్తాం.

- వెంకటేశ్‌నాయక్, విద్యాశాఖాధికారి, సుండుపల్లె

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వేరుశనగ సాగు



వేరుశనగ విత్తనాలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో శుద్ధి చేస్తున్న సిబ్బంది

రాయచోటిటౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వేరుశనగ సాగు ఎంతో మేలని మాస్టర్ ట్రైనర్ చిన్నరెడ్డెన్న, యూనిట్ ఇన్‌చార్జిలు హరిబాబు, వెంకటరత్నమ్మ, ఐసీఆర్‌పీ ఉరుస్వామి తెలిపారు. మండల పరిధిలోని గొర్లముదివేడు క్లస్టర్‌లో గల మాధవరంలో ప్రకృతి వ్యవసాయ ఆధ్వర్యంలో ఎన్ఎంఎన్ఎఫ్ గ్రామం కాటిమాయకుంట పరిధిలో రైతు శ్రీనివాసులరెడ్డి ప్రకృతి వ్యవసాయ విధానంలో ప్రోటోకాల్ ప్రకారం 10 ఎకరాల వేరుశనగ విత్తనాలను అంతర పంటలుగా అనప, అలసంద, పెసర, కంది, రక్షక పంటలతో సజ్జ, జొన్న, ఎరపంటగా ఆముదంతో కలిపి షోయింగ్ చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ చిన్నరెడ్డెన్న మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పెట్టుబడి తగ్గి దిగుబడి పెరిగి రైతుకు ఆదాయం ఎక్కువగా ఉంటుందన్నారు. అలాగే అంతర పంటలు ఎర పంటలు రక్షక పంటకు పురుగులు గానీ, తెగుళ్లు గానీ రాకుండా కాపాడతాయన్నారు. కావున ప్రతి రైతూ వేరుశనగతో పాటు ఇతర రకాల పంటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జిలు హరిబాబు, వెంకటరమణమ్మ మాట్లాడుతూ వేరుశనగలో అంతర పంటలు వేయడం ద్వారా సూక్ష్మ జీవులు బాగా అభివృద్ధి చెందుతాయని,ఇందులో ఘనజీవామృతం చేయడం ద్వారా వానపాములు భూమిని బాగా గుల్లపరిచి పంట దిగుబడి ఇస్తాయని వివరించారు. అనంతరం ఐసీఆర్‌పీ గురుస్వామి మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి చాలా సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాడని, అందువల్ల ఆయన కుటుంబంలో అందరూ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. కావున ప్రతి రైతూ ప్రకృతి సేద్యం చేయాలన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



రైతుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్, సిబ్బంది

రాజంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలని ఊటుకూరు గ్రామ కార్యదర్శి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం పోలి యూనిట్ ఊటుకూరు గ్రామంలో నిర్వహించిన రైతుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయం ద్వారా కూరగాయాలు, పంటలు పండించి అందరూ ఆరోగ్యంగా జీవించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటల వల్ల అధిక లాభాలు ఉంటాయన్నారు. అనంతరం రైతులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : ఓబులవారిపల్లె మండల పరిధిలోని బాలిరెడ్డిపల్లె గ్రామ పంచాయతిలో ఖరీఫ్ సీజన్ ప్రణాళికపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం ఎంతో మేలు అని ఏపీసీఎన్ఎఫ్ ఎస్పీఎం బుల్లయ్య తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలకు ఎక్కువ గిరాకీ ఉంటుందన్నారు. అదేవిధంగా రసాయన విధానంలో పండించిన పంటల కంటే అధిక ధర వస్తుందని, పంటలు నాణ్యంగా ఉంటాయని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బాబుల్‌రెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’తో నిరుపేద కుటుంబాల్లో సంతోషం



ఆనందం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు

సిద్దవటం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : చదువుకుంటున్న విద్యార్థుల తల్లులు చెప్పలేని ఆనందంలో ఉన్నారు. ఇంటిలో చదువుకుంటున్న పిల్లలందరికీ ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున కూటమి ప్రభుత్వం నగదును తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఇంటిలో ఒక్క విద్యార్థికి మాత్రమే రూ.13 వేలు వేసింది. వేసిన నగదుకు ఎన్నో ఆంక్షలు విధించేది. మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేట, నలందా నగర్ గ్రామంలో నివశిస్తున్న తల్లి మాబుజాన్, పిల్లలు జిలానిబాషా, ముస్తాని, మొబినాలు పోలీసు పటాలయం స్కూల్లో చదువుతున్నారని, ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున రూ.39 వేలు అకౌంట్‌లో జమ కావడంతో ఆ తల్లి చెప్పలేని ఆనందం వ్యక్తం చేసింది.

తల్లికి వందనం... కుటుంబంలో ఆనందం

ఓబులవారిపల్లె, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : బాలిరెడ్డిపల్లె పంచాయతీలోని ఓ కుటుంబంలో తల్లికి వందనం పథకం ముగ్గురు మంజూరైందని టీడీపీ సీనియర్ నాయకుడు జీవీ రెడ్డి తెలిపారు. తమ గ్రామ పంచాయతిలో సుమారు 250 మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు.

కూటమి ప్రభుత్వం రుణం తీర్చుకోలేనిది

పెనగలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) :తమకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉందని ముగ్గురుకి రూ.39 వేలు జమ అయిందని కొత్త సింగనమల గ్రామానికి చెందిన గంజికుంట గంగరాజు, నాగేశ్వరి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

రాయచోటిటౌన్, జూన్14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం ప్రారంభం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అభినందనలు తెలుపుతూ శనివారం రాయచోటి టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మహిళా నేతలు సుజాత, నసీబ్‌జాన్, మస్తాన్ బీ, మెహతాజ్ తదితరుల ఆధ్వర్యంలో పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళలు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడంతో తల్లుల ఆర్థిక స్థితి మెరుగవుతుందని, చదువులకు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతాయని హర్షం వ్యక్తం చేశారు.

ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ధర్నా

రాయచోటిటౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా శనివారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీ ఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. రవిశంకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ మాట్లాడుతూ దేశంలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్లకు దోచిపెట్టడానికి ఆపరేషన్ కగార్ ఏర్పాటు చేశారన్నారు. అంబేడ్కర్ సంఘం నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పేద వర్గాలపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు.

యోగాంధ్రలో మనమూ భాగస్వాములం అవుదాం



యోగా కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు బెటాలియన్ సిబ్బంది

రామాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):యోగాంధ్రలో మనమూ భాస్వాములం అవుదాం అని మండల ప్రత్యేక అధికారి విశ్వనాథ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం చేపట్టిన యోగాసన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచి యోగాసనాలు చేయడం వల్ల శారీరకంగానూ, మానసికంగానూ దృఢంగా ఉండవచ్చునన్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విశాఖపట్టణంలో పాల్గొంటారని, అందుకు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాషువా, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈవో-2 జయచంద్ర, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, మండలంలోని 13 పంచాయతీల కార్యదర్శులు మోడల్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులు యోగాతో నయం

సిద్దవటం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యోగాంధ్ర 2025లో భాగంగా పోలీసు పటాలయంలో శనివారం కమాండెంట్ ఆనంద్‌రెడ్డి ఆదేశాలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ వెంకటశివుడు మాట్లాడుతూ ఇషా ఫౌండేసన్ వారి ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహించి యోగా దినచర్యలో భాగంగా ప్రతిఒక్కరు యోగా నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధుల ఉపశమనం పొందవచ్చునని, ఆయుష్ విభాగంలో యోగా వైద్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం ముందు నెలరోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా ఇషా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి బహుమతులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వెంకటశివుడు, బెటాలియన్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో...

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మాస్ యోగా కార్యక్రమం విజయవంతమైంది. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకర రామకృష్ణ, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలతో కలిసి మాస్ యోగా చేపట్టారు. అనంతరం జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి ప్రజల్లో యోగాపై అవహాన కల్పించారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న కార్మిక సంఘం నేతలు

రాజంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : అహ్మదాబాదులో జరిగిన ఘోర విమాన ప్రమాదంలోని మృతులకు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రసాద్, రమణ, సునీత, వెంకటమ్మ, ఎం.రమణ పాల్గొన్నారు.

నీలినాలుక టీకాలపై అవగాహన అవసరం



టీకాలు వేస్తున్న డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై, సిబ్బంది

రాజంపేట టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల్లో నీలినాలుక వ్యాధిపై కాపరులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. శనివారం రాజంపేట మండలం హెచ్.చెర్లోపల్లె, గొల్లపల్లె గ్రామంలో నీలినాలుక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొర్రెల్లో నీలినాలుక వ్యాధి లక్షణాలను, టీకాల ఆవశ్యకతను తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.రాజంపేట ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్, హెచ్.చెర్లోపల్లె పశువైద్యాధికారిణి డాక్టర్ కె.భాగ్యవతి, జూనియర్ వెటర్నరి ఆఫీసర్ ఎం.వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం పశువైద్య అధికారిగా భాస్కర్



చిన్నమండెం, జూన్14(ఆంధ్రజ్యోతి): చిన్నమండెం పశువైద్యాధికారిగా డాక్టర్ భాస్కర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో గాలివీడు మండల పశువైద్యాధికారిగా పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. కాగా చిన్నమండెంలో పనిచేస్తున్న డాక్టర్ గణేశ్ వీరబల్లికి బదిలీ అయ్యారు.

శ్రీనివాసులు మృతికి సంతాపం

చిన్నమండెం, జూన్14(ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలం దేవగుడిపల్లికి చెందిన శ్రీనివాసులు (62) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు, టీడీపీ యువనాయకుడు నిశ్చల్‌నాగిరెడ్డి నివాళులర్పించారు. శ్రీనివాసులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

‘తల్లికి వందనంపై వైసీపీ దుష్ప్రచారం తగదు’

సంబేపల్లె, జూన్14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనంపై వైసీపీ దుష్ప్రచారం మానుకోవాలని తెలుగు యువత రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి అశోక్‌చౌదరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.2 వేలు లోకేశ్ జేబులోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేయడం సంస్కారం కాదన్నారు. అలా అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.15 వేలు చెప్పి రూ.13 వేలు మాత్రమే తల్లుల ఖాతాలో జమ చేశారని, ఆ రూ.2 వేలు జగన్ జేబులోకి వెళ్లిందా అని ప్రశ్నించారు.

రక్తదానం పుణ్యకార్యం: ఎస్‌ఐ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

గాలివీడు, జూన్14(ఆంధ్రజ్యోతి): రక్తదానం పుణ్యకార్యమని ఎస్‌ఐ రామకృష్ణ అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తాన్ని దానం చేయాలన్నారు. అనంతరం 30 మంది యువకులు రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు మహేశ్‌నాయక్, డాక్టర్ మౌలాలి, శివారెడ్డి, ఎద్దుల రామంజులు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం కార్మికులకూ వర్తింపజేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

రాజంపేట టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో తల్లుల ఖాతాల్లో కొంత నగదును జమ చేస్తోందని, అదేవిధంగా మున్సిపల్, అంగన్వాడీ, ఆశావర్కర్‌లు తదితర కార్మికుల పిల్లలకు కూడా ఆ పథకం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో రాజంపేట మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ మాట్లాడుతూ కార్మికుల పిల్లలకు కూడా తల్లికి వందనం పథకం అమలయ్యేలా చూడాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, బుజ్జమ్మ, సునీత, ప్రమీల, ప్రసన్న, సురేష్ పాల్గొన్నారు.

చమర్తిని సత్కరించిన టీడీపీ నేతలు

సిద్దవటం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మపాలెంలో నిర్వహించిన గజపూజ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజును శనివారం టీడీపీ క్లస్టర్ మండల ఇన్‌చార్జి దశరథనాయుడు కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించి గజమాల వేశారు. ఈ కార్యక్రమంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. సిద్దవటం మండలంలో సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతి మోహన్‌రెడ్డి, మండల మాజీ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ జవహర్‌బాషా, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుడు తిరుపతి నాయుడు, టీడీపీ యువనేత రాఘవేంద్రనాయుడు పాల్గొన్నారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



కమ్మపాలెంలో చమర్తి జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వైభవంగా వసంతోత్సవం

పుల్లంపేట జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పర్వతవర్ధినిదేవి శాంతిలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి వసంతోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతులను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రంగు రంగుల నీళ్లు పోసుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న పసుపు



- వెయ్యి ఎకరాలకు పైగా సాగు..
- ఎకరాకు లక్ష రూపాయల దాకా ఆదాయం
- రైతుల్లో ఆనందం

రాజంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పసుపు పంట రైతులకు కాసులు కురిపించింది. సిద్దవటం మండలంలోని బాకరాపేట, సిద్దవటం, మంటపంపల్లె, ఒంటిమిట్ట మండలంలోని ఒంటిమిట్ట, మంటపల్లె తదితర 30 గ్రామాల్లో ఈ ఏడాది వెయ్యి ఎకరాలకు పైగా పసుపు సాగు చేశారు. ఏప్రిల్ నుంచి మే మాసాంతానికి పంట చేతికొచ్చింది. అన్ని ఖర్చులు పోను ఎకరాకు లక్ష రూపాయలు పైగా ఆదాయం వచ్చింది.. మార్చి నుంచి ఏప్రిల్ వరకు పసుపు విత్తడం ప్రారంభిస్తారు. ఇంటిల్లిపాది కష్టపడడంతో పాటు విత్తడం, ఎరువులు , కలుపు , పురుగుమందుల పిచికారీ తదితరాలకు ఎకరాకు సుమారు 60 వేల వరకు ఖర్చు చేస్తారు. వేసవి నాటికి పంటకాలం పూర్తవుతుంది. ఆ సమయంలో పసుపు దుంపలను ప్రాసెస్ చేసి, ఎండబెట్టి కడప, ప్రొద్దుటూరు, తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల్లోని మార్కెట్‌కు తరలిస్తారు. ఈ మధ్య కాలంలో వివిధ కారణాలతో పసుపు సాగు విస్తీర్ణం తక్కువ కావడంతో డిమాండ్ పెరిగి పోయింది. దీనికి తోడు ఒక్కో ఎకరాకు 40 నుంచి 80 పుట్ల (ఒక పుట్టి = 240 కిలోలు) వరకు పంట దిగుబడి వచ్చింది. ప్రస్తుతం ఒక్కో పుట్టి రూ. 4100 నుంచి రూ. 4500 వరకు ధర పలికింది. దీంతో ఖర్చులు 60 వేలు పోను, ఎకరాకు లక్ష రూపాయలకు పైగా ఆదాయం వచ్చింది. . ప్రతి ఏడు ప్రకృతి వైపరీత్యాల కారణంగా భారీగా నష్టపోతున్న రైతుకు పసుపు సాగుతో కొంత ఊరట లభించింది.


పసుపు దుంలను ఉడికేస్తున్న రైతులు

మూడేళ్లుగా లాభాలొస్తున్నాయి



మూడేళ్లుగా పసుపు సాగుతో లాభాలు వస్తున్నాయి. రెండెకరాల్లో పసుపు సాగు చేశాను. నా వరకు రెండెకరాలకు రూ. 2 లక్షలదాకా ఆదాయం వచ్చింది. గత ఏడాది కూడా ఇదేవిధంగా లాభం వచ్చింది.

- కె.శ్రీనివాసులునాయుడు, పసుపు రైతు

హోరాహోరీగా అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీలు

- 110 పరుగుల ఆధిక్యంతో చిత్తూరు, అనంతపురం జట్ల గెలుపు

కడప స్పోర్ట్స్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-19 పురుషుల అంతర్‌జిల్లాల ఒకరోజు క్రికెట్ పోటీల్లో శనివారం రెండు వేర్వేరు జట్లు తమ ప్రత్యర్థి జట్లపై 110 పరుగుల తేడాతో విజయం సాధించాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో..

నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో టాస్‌నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 46.2 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో నెల్లూరు జట్టు బౌలర్ భార్గవ్‌మహేష్ 5 వికెట్లు సాధించగా, సోహన్‌రెడ్డి 110 పరుగులు చేసి భారీ స్కోర్ సాధించేందుకు దోహదపడ్డాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 31.5 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. ఈ జట్టు క్రీడాకారుడు ఎస్. హమీద్ 60 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో చిత్తూరు జట్టు 110 పరుగుల భారీ స్కోర్ తేడాతో గెలుపొందింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో

నగర శివారులోని కేఎస్ఆర్ఎం మైదానంలో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 283 పరుగులు సాధించింది. ఇందులో రెహన్ 117 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 31.3 ఓవర్లలో 173 పరుగులకు కుప్పకూలింది. ఇందులో ఓంకార్ 57 పరుగులు చేశాడు. మిగతా బ్యాట్స్‌మెన్స్ అలా వచ్చి ఇలా వెళ్లారు. బౌలింగ్ విభాగంలో అనంతపురం జట్టు బౌలర్ ఏ. నిషే 5 , టీ.వి. సాయిప్రతాప్‌రెడ్డి 5 వికెట్లు సాధించారు. దీంతో 110 పరుగుల భారీ స్కోర్‌తో అనంతపురం జట్టు విజయం సాధించింది.

ప్రభుత్వ ఆసుపత్రికి తాళం.. ఎమ్మెల్యే ఆగ్రహం!

మైదుకూరు రూరల్ ,జూన్ 13(ఆంధ్రజ్యోతి) :ప్రజలకు సేవ చేసే సిబ్బంది కావాలి కానీ, జీతాల కోసం పనిచేసే వారు అవసరం లేదని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మండిపడ్డారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.
పనివేళల్లో తాళాలు వేసి ఉండటంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. వెంటనే జిల్లా వైద్య అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, భీమయ్య, శీర్ల నాగమోహన్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రికి వేసిన తాళాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

ఆలయ అభివృద్ధికి విరాళం

పెండ్లిమర్రి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):నందిమండలం సమీపంలోని గంగమ్మ ఆలయ అభివృద్ధికి శనివారం కొత్తూరుకు చెందిన రాజశేఖర్‌రెడ్డి రూ.2లక్షలు, సోమా రామసుబ్బిరెడ్డి రూ.30వేలు విరాళం ఇచ్చినట్లు ఈఓ మారుతి ప్రసాద్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆల య అభివృద్ధికి ఖర్చు చేస్తామని తెలిపారు.

నీట్ ఫలితాల్లో ఆకాష్ విజయ దుందుబి


విద్యార్థులను అభినందిస్తున్న ఆకాష్ అధ్యాపక బృందం

కడప ఎడ్యుకేషన్,జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష ఫలితాల్లో ఆకాష్ విద్యాసంస్థ విజయదుందుభి మోగించిందని ఆకాష్ విద్యాసంస్థల బ్రాంచ్ మేనేజర్ సుధాకర్‌రావు తెలిపారు.ఆలిండియా స్థాయిలో బి.డింపుల్ 533, బి.మోక్షిత 521 ర్యాంకులు సాధించి టాపర్‌గా నిలిచారన్నారు. అబ్దుల్ రెహమాన్, బాలాజి, జాహ్నవి, హర్షిత మెరుగైన ర్యాంకులు సాధించారని చెప్పారు. విద్యార్థులను ఆకాష్ విద్యాసంస్థరాష్ట్ర ప్రతినిధులు నారాయణ మూర్తి, నిశాంత్‌మిశ్రా, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్, ఏరియా సేల్స్ హెడ్ నరసింహులు, అకాడమిక్ హెడ్ అప్సర్ బాష సుబ్రమణ్యం అభినందించారు.

నాటు సారా బట్టీలు ధ్వంసం

- ఇద్దరిపై కేసు నమోదు ● 330 లీటర్ల ఊట ధ్వంసం


స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో ఎక్సైజ్ సిబ్బంది

పీలేరు రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కలకడ మండలం ఎనుగొండ పాళ్యం దిగువ తాండా పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి నాటుసారా బట్టీలను ధ్వంసం చేసినట్లు పీలేరు ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం పీలేరు, కలకడ మండలాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించామన్నారు. కలకడ మండలం ఎగుగొండపాళ్యం దిగువతాండా వద్ద బట్టీలతోపాటు 330 లీటర్ల ఊటను ధ్వంసం చేసి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దిగువ తాండాకు చెందిన శశినాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎలేరు మండలం జంగంపల్లె వద్ద భాగ్యమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకుని 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎవరైనా నాటు సారా తయారీ, తరలించడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో రాయచోటి, పీలేరు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా విక్రేత అరెస్టు


పట్టుబడిన మహిళతో ఎక్సైజ్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెన్నరాజుపోడు క్రాస్ రోడ్డు వద్ద నాటు సారా విక్రయిస్తున్న పాలెంకోట లక్షుమ్మ అనే మహిళను శనివారం అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు. ఆమె నుంచి పది లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుళ్ల చంద్రశేఖర్, శ్రీనివాసులు, కానిస్టేబుళ్ల మధుసూదన్‌రాజు, సోమేశ్వర్, బసిరెడ్డి, రమణారెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ


చోరీ తీరు పరిశీలిస్తున్న పోలీసులు


రైల్వేకోడూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో శనివారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. ఉదయాన్నే తలుపులు తెరిచేందుకు వెళ్లిన దుకాణదారు తాళాలు పగులగొట్టి ఉండడం గుర్తించాడు. తలుపులు తెరవకుండానే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి పరిశీలించారు. దొంగలు దుకాణంలోని వస్త్రాలతో పాటు, రూ. 70 వేలు నగదు దోచుకుని వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో డ్రైవర్ అరెస్టు


అరెస్టు చేసిన డ్రైవర్‌ను చూపుతున్న పీటీఎం పోలీసులు

పెద్దతిప్పసముద్రం జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వాహనంతో ఇద్దరు యువకులను ఢీకొని వారి మృతికి కారణమైన కేసులో వాహన డ్రైవర్‌ను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ హరిహర ప్రసాద్ తెలియజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పీటీఎం ఎస్సీ కాలనీకి చెందిన దండు శంకర కుమారుడు శ్రీనివాసులు (22), సాదిలి గంగాద్రి కుమారుడు చందు (22) మార్చి 18వ తేదీ రాత్రి బి.కొత్తకోటలో సెకండ్‌షో సినిమాకు వెళ్లి వస్తుండగా పీటీఎం సమీపంలోని వెంకటేశ్వర కోళ్ల ఫారం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ కేసు దర్యాప్తు చేసిన పీటీఎం పోలీసులు ఈ ప్రమాదానికి సిమెంట్ మిక్సర్ వాహనం కారణంగా గుర్తించారు. కర్ణాటక రాష్ట్రం బీజాపుర్‌కు చెందిన ఆ వాహన డ్రైవర్ జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దావరిక యాదవ్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.

హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్ట్


హత్యాయత్నం కేసులో నిందితులతో పోలీసులు

ఓబులవారిపల్లె, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు చిన్నరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై దాడిచేసిన కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తల్లెంవారిపల్లెకు చెందిన చిన్నరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై దాడి చేసి తల, ఒంటిపై గాయాలు చేసిన అదే గ్రామానికి చెందిన కొలవల అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డిని జీవీపురం పరిధిలో అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. గ్రామాల్లో సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీట్ ఫలితాల్లో కడప 'నారాయణ' హవా


విద్యార్థులను అభినందిస్తున్న కోర్ డీన్ చంద్రకిశోర్‌రెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష ఫలితాల్లో కడప తమ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ పరీక్షలలో కడప నారాయణ కళాశాల విద్యార్థులు ఎం.పల్లవి ఆలిండియా స్థాయిలో 743 ర్యాంకు, కె.రమ్యసాయి 16,344, ఎం.జోషిణి 18,562, ఎస్.మహమ్మద్ అమీన్ 19,986, ఎస్.సలేహ 30,074, కె.సందూరి 36,184, బి.సహస్ర 41,549, జి.లక్ష్మిచైతన్య 44,990, జి.ఆఫ్రిన్ భాను 56369 ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులు తమ పట్టుదలతోను తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఈ ఘన విజయం సాధించారని తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కోర్ డీన్ చంద్ర కిశోర్‌రెడ్డి, డీన్ సుబ్బారావు, బాలవెంకటరెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ మురళిమోహన్, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, రాఘవరెడ్డి, సుమన్ అభినందించారు.

శ్రీచైతన్య సంచలనం


విద్యార్థులతో శ్రీచైతన్య అధ్యాపక బృందం

కడప ఎడ్యుకేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఏ ప్రకటించిన నీట్ ఫలితాలలో శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారని ఏటీఎం బీవీ ప్రసాద్ తెలిపారు. నీట్ పరీక్షలో శ్రీచైతన్య తిరుపతి శాఖకు చెందిన విద్యార్థులు ఆరుష్ లక్ష్మణ్, జాతీయస్థాయిలో 337వ ర్యాంకు, వి.యశ్వంత్ 1042, వి.దేవేంద్రన్ 1365, ఎన్.హరిత 2121, వివిల్ హర్షిత 2277, కె.టీనారాణి 2368, జి.గుణభూషణ్ 2460, వై.దీక్షిత 2695, వై.మహతి 3723, వై.శివకృతిక్ 4126, కె.హర్షిత 429, కె. కల్పన 4824 వంటి టాప్ ర్యాంకులతో పాటు జాతీయస్థాయిలో 10వేల లోపు ర్యాంకులు 28మంది, 20వేల లోపు ర్యాంకులు 46 మంది, వివిధ కేటగిరీల నుంచి సుమారు 120 మంది వరకు ఎంబీబీఎస్ సీట్లు సాధించగలిగే ర్యాంకులు సాధించి రాయలసీమలోనే మరి ఏ ఇతర విద్యాసంస్థకు సాధ్యం కాని స్థాయిలో మరొకసారి శ్రీచైతన్య అగ్రగామిగా నిలిచిందన్నారు. విద్యార్థులను డైరెక్టర్లు సుష్మశ్రీ, నాగేంద్రలు అభినందించారు.

భార్య కళ్లెదుటే కడతేరిపోయిన భర్త

- రోడ్డు ప్రమాదంతో విషాదం

కలకడ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో ఉన్న కుమారుడిని చూసేందుకు భార్యతో కలిసి బయలుదేరిన ఓ తండ్రి రోడ్డు ప్రమాదంలో విగతజీవుడైన సంఘటన శనివారం రాత్రి కలకడ వద్ద జరిగింది. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఉన్న హంద్రీ-నీవా కాల్వ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శంకు శ్రీనివాసులు(50) మృతి చెందారు. సంబేపల్లె మండలం శెట్టిపల్లె జంగంపల్లెకు చెందిన శ్రీనివాసులు, తన భార్య సుశీలతో కలిసి కలికిరి మండలం కొట్టాల పంచాయతీ నడింపల్లెలో ఉన్న కుమారుడి వద్దకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో కలకడ మండలం బాటవారిపల్లె వద్దనున్న హంద్రీ-నీవా కాల్వ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో అదుపు తప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. భార్య సుశీల ప్రాణాలతో బయటపడింది. కలకడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. రెప్పపాటులో జరిగిన ప్రమాదంలో భర్త కడతేరిపోవడంతో సంఘటనా స్థలంలో సుశీల రోదనలు అందరి హృదయాలను కలిచి వేసింది.

స్వదేశానికి రప్పించాలంటూ కువైత్ నుంచి మహిళ వేడుకోలు

- వీడియో ద్వారా నారా లోకేశ్‌కు విజ్ఞప్తి

పీలేరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కువైత్ నుంచి తనను స్వగ్రామానికి రప్పించాలంటూ కేవీపల్లె మండలం గ్యారంపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన పుష్ప అనే మహిళ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. కువైట్‌లో తాను ఉంటున్న ఇంటి బాత్రూం నుంచి తాను వీడియో చేస్తున్నానంటూ ఆమె ఆ వీడియోలో తెలిపారు. గ్యారంపల్లె కురవపల్లెకు చెందిన తాను జీవనోపాధి కోసం పీలేరుకు చెందిన ఏజెంట్ల ద్వారా కువైట్‌కు వచ్చానని, తనకు చెప్పిన పని ఇవ్వకుండా ఇతర పనులు చెబుతున్నారని, వారి మాట విననందుకు హింసిస్తున్నారని, తనను చంపేస్తారేమోనన్న భయం కూడా ఉందని ఆమె విలపించింది. ఈ వీడియో శనివారం సాయంత్రం సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యింది. గ్యారంపల్లె కురవపల్లెకు చెందిన కృష్ణయ్య, పార్వతమ్మల కూతురు పుష్ప రెండు నెలల క్రితం కువైట్‌కు వెళ్లింది. భర్త నుంచి విడాకులు తీసుకోవడంతో ఇద్దరు పిల్లలను పోషించుకునేందుకు ఆమె కువైట్‌కు వెళ్లిందని ఆమె బంధువులు తెలిపారు. నెల జీతం కూడా ఇటీవల కుటుంబసభ్యులకు పంపినట్లు తెలిసింది. అయితే, తాను అక్కడ ఉండలేనని తనను పిలుపించుకున్న ఏజెంట్లకు చెప్పానని, రెండు వేల దీనార్లు చెల్లించి స్వదేశానికి వెళ్లిపోవచ్చునని వారు తెలిపారని, అయితే తన వద్ద అంత డబ్బు లేదని మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. గతంలో తనలా నిస్సహాస్థితిలో చిక్కుకున్న వారినెందరినో కాపాడిన నారా లోకేశ్, తనను కూడా కాపాడాలని కోరింది. ఆయన స్పందించకుంటే తనకు మరణమే శరణమని వాపోయింది. ఈ విషయమై కేవీపల్లె ఎస్ఐ చిన్నరెడ్డయ్య మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ద్వారా పుష్ప దీనస్థితి తెలిసింది, ఆమె కుటుంబ సభ్యుల ద్వారా ఏజెంట్ల గురించి తెలుసుకుని, వారి ద్వారా ఆమెను స్వదేశానికి రప్పించే ప్రయత్నం చేస్తామన్నారు.


వీడియోలో విలపిస్తున్న పుష్ప

ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్లు..!

- రీ సర్వేలో రెవెన్యూ.. కనికట్టు!
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్నరైతులు




చక్రాయపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రీసర్వేతో ఉత్పన్నమైన సమస్యలు కూటమి ప్రభుత్వంలో పరిష్కారమవుతాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ఈ ప్రభుత్వం కూడా అదే మార్గంలో నడుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు చూపడంలో అధికారులు ఆరితేరి పోయారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
మండలంలో రీసర్వే కారణంగా సుమారు 60 మందికి పైగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. యార్లవాండ్లపల్లెలో నాగయ్య అనే రైతుకు 2.30 ఎకరాల భూమి ఉండగా రీ సర్వేలు 30సెంట్లు మాత్రమే ఉన్నట్లు తేల్చారు. పెద్దింటి రామచంద్రకు 2.69 ఎకరాలుండగా 45 సెంట్లు ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో ఈయన కలెక్టర్‌కు ఫిర్యాదుచేయగా, అక్కడి నుంచి తక్షణం తహసీల్దార్‌కు ఫోన్ వచ్చింది. ఇప్పటికి రెండేళ్ల అవుతున్నా ఇంతవరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. చక్రాయపేట గ్రామంలో గంగులయ్య అనే వ్యక్తికి 1,679 ఎకరాల భూమి ఉన్నట్లు చూపారు. పోతుల చెన్నయ్య, మేకల చిన్నగంగయ్య, గంగులయ్య, నాగశివ, చిన్నయ్య, బాలిరెడ్డి, తిమ్మారెడ్డిగారిపల్లెకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, లక్ష్మినారాయణ, కృష్ణవేణి, ఇసుక చింతలపల్లెకు చెందిన కృష్ణవేణి, సహదేవరెడ్డి తదితరుల భూముల వివరాలు కూడా తారుమారయ్యాయి. ఇలా చెప్పుకొంటూ పోతే వందల మంది రీసర్వే బాధితులు ఉన్నారు. ఈ నేపథ్యంలో 1బి, అడంగల్ రాకపోవడంతో బ్యాంకుల్లో రుణాలు రెన్యువల్ చేసుకోలేక ఇబ్బందిపడుతున్నారు. ఉన్నతస్థాయి అధికారులు కాని, కలెక్టర్ గాని స్పందించి మండలంలో రీసర్వేతో నష్టపోయిన తమను వెంటనే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఒక సర్వే నెంబర్‌కు మూడు ఖాతాలు:

ఒక రైతుకు సంబంధించిన ఖాతాలో ఎన్ని సర్వేనెంబర్లు అయినా ఉండవచ్చు. అందుకు విరుద్ధంగా ఒక సర్వే నెంబర్‌కు మూడుఖాతాలు ఇచ్చిన దాఖలాలు చక్రాయపేట మండలంలో కనిపిస్తున్నాయి. ఒక సర్వే నెంబర్‌కు నాలుగైదు ఖాతాల నెంబర్లు ఇవ్వడం మరీ దారుణమని రైతులు ఆరోపిస్తున్నారు.

కూలి చేసుకుని బతుకుతున్నా..



యార్లవాండ్లపల్లెలో రెండేళ్ల క్రితం రీసర్వే చేశారు, గ్రామ సమీపంలో నాకు 2.30ఎకరాలు ఉండగా కేవలం 30 సెంట్లు మాత్రమే కనిపిస్తోంది. నా భూమి కనిపించలేదని రెవెన్యూ అధికారులను అడిగినా పలకడం లేదు. లోను రెన్యువల్ చేసుకోలేక, పింఛన్ రాకపోవడంతో నాకు జీవనం కష్టం అయిపోయింది. కూలినాలి చేసుకొని బతుకుతున్నా.. నామొర ఆలకించేనాథుడే లేడు.

- నాగయ్య,యార్లవాండ్లపల్లె

2.60 ఎకరాలు కనిపించడం లేదు



నాది తిమ్మారెడ్డిగారిపల్లె. మా భార్య కృష్ణవేణికి చెందిన 2.60ఎకరాలు భూమి రికార్డుల్లో కనిపించడం లేదని రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదు. దీంతో సంక్షేమ పథకాలు అందడం లేదు. రుణాలు రెన్యువల్ కూడా చేసుకోలేకపోయాం. నాలాంటి వారు మండలంలో వందలాది మంది ఉన్నారు. కలెక్టర్ స్పందించి మా సమస్య లు పరిష్కరించాలి.

- లక్ష్మినారాయణ, తిమ్మారెడ్డిగారిపల్లె

బిజినెస్ ప్లస్

కడప ● ఆదివారం 15 జూన్ 2025

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఓఎంఎఫ్).. బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. దీని బీఎస్ఈ 1000 టీఆర్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఇండెక్స్ ఫండ్‌లో లార్జ్, మిడ్, స్మాల్, మైక్రోక్యాప్ విభాగాలకు చెందిన కంపెనీలున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 19.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,680 ▲	93,200 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,300 ▲	97,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,01,400 ▼	93,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,670 ▲	93,200 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,05,000 ▲
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲



నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా మీ తండ్రికి ఏదైనా బహుమతి ఇవ్వాలనుకుంటున్నారా..? చిన్న పిల్లలిచ్చే చిరు కానుకైనా నాన్నకు కలిగే సంతోషం చెప్పలేనంత. టీనేజీలో ఉంటే.. డాడీ ఇచ్చే పాకెట్ మనీతో గిఫ్ట్ కొని ఆయన్ని సంబుర పెట్టవచ్చు. ఇప్పటికే ప్రయోజకులై, సంపాదిస్తుంటే మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించండి. మీ జీవితానికి సుస్థిర బాట వేసిన నాన్న భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే కానుక అందించడం మేలు.

లవ్ యూ U నాన్న

Happy Father's Day

ఆరోగ్య బీమా

వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరగడం సాధారణం. కానీ, ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైపోయింది. దేశంలో వైద్య ఖర్చులు ఏటా 14 శాతం చొప్పున పెరుగుతున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ నాన్న ఆరోగ్యానికి బీమాతో ధీమా కల్పించండి. మీ నాన్న పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడం మేలు. మీ తండ్రి గారికి ఇప్పటికే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలుంటే వాటికీ బీమా కవరేజీ లభించేలా పాలసీ తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీ తండ్రి వయసు 50-60 ఏళ్ల పైబడితే, క్యాన్సర్, గుండెపోటు వంటి తీవ్ర అనారోగ్యాల ఖర్చులకూ కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెల్ పాలసీని తీసుకోవడం మంచిది.

రిటైర్మెంట్ ప్లాన్

మీ నాన్నకు రిటైర్మెంట్ ప్లాన్ బహుమతిగా ఇవ్వండి. లేదా ఆయన పేరిట యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ (యూఎల్‌పీపీ)లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా ఈ పథకాలు ఈక్విటీలతో పాటు రుణపత్రాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. కాబట్టి, దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలు లభించే అవకాశం ఉంటుంది. ఈ పాలసీ గడువు ముగిశాక, పోగైన కార్పస్‌లో 60 శాతం వెనక్కి తీసుకొని, మిగతా సొమ్ముతో నెలవారీ పెన్షన్ లభించేలా ప్లాన్ చేయండి. తద్వారా మలి వయసులో మీ నాన్నకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించండి. అంతేకాదు, మన సగటు ఆయుష్షు 80 ఏళ్లకు పెరిగింది. కాబట్టి, రిటైర్మెంట్ తర్వాత 20-30 ఏళ్ల వరకు మీ నాన్నకు ప్రతినెలా ఖర్చులకు సరిపడా సొమ్ము చేతికందేలా దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టండి.

పొదుపు పథకాలు

మీ తండ్రి పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. ఒకవేళ సీనియర్ సిటిజన్ అయితే, అధిక వడ్డీ చెల్లించే పొదుపు పథకాలు చాలా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వీరి కోసం ప్రత్యేక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. లేదంటే, ఏదైనా మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలు (సిప్) కూడా మంచి ప్రత్యామ్నాయం.

షేర్లు, సెక్యూరిటీలు

భవిష్యత్‌లో మంచి ప్రతిఫలాలు అందించేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లను కానుకగా ఇవ్వండి. ప్రభుత్వ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. కొంత రిస్క్ తీసుకోగలిగితే, మంచి రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

యాడ్ ఆన్ కార్డ్

మీ క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డు తీసుకోగలిగే వెసులుబాటు ఉంటే.. దాన్ని మీ నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. తద్వారా చిన్న మొత్తాల్లో ఖర్చుల కోసం వారు ఆ కార్డును ఉపయోగించుకునే వీలుంటుంది.

దేశ ఆర్థికాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా వస్తు రవాణా సేవలు (ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్) సరిగా లేకుంటే ఏ ప్రాంతంలో కూడా పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరగదు. ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు కావాలన్నా, తయారైన వస్తువులు బయటకు పోవాలన్నా, ఒక వ్యాపారి సరుకు కొనుగోలు చేయాలన్నా, అమ్మాలన్నా లేదా ఒక రైతు పండించిన పంటను అమ్ముకోవాలన్నా రవాణా సౌకర్యం లేకుంటే ఏదీ జరగదు. ఇంత ముఖ్య పాత్ర పోషిస్తున్న 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్'కు సంబంధించి జీఎస్‌టీ విధివిధానాలు, పన్ను రేటు వివరాలు మీ కోసం. ఇంతకు ముందు సర్వీస్ ట్యాక్స్‌లో కానీ ఇప్పుడు జీఎస్‌టీలో కానీ వస్తు రవాణాకు సంబంధించి 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ' అనే ఒక సర్వీస్ ప్రవేశపెట్టడం జరిగింది. దీనినే జీటీఏ అని అంటారు. జీఎస్‌టీలో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ మీద విధించే పన్ను ఈ జీటీఏకు సంబంధించి ఉంటుంది. మరి జీటీఏ అంటే ఏమిటి? వస్తు రవాణా చేసే ప్రతి వాహనం జీటీఏ కిందకు వస్తుందా?

జీఎస్‌టీ పరిభాషలో చెప్పాలంటే రోడ్డు ద్వారా వస్తు రవాణా చేస్తూ కన్‌సైన్‌మెంట్ నోట్ లాంటివి ఇచ్చే వ్యక్తి లేదా సంస్థను గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ అంటారు. మరి కన్‌సైన్‌మెంట్ నోట్ అంటే ఏమిటి? దీనికి అటుఇటుగా నిర్వచించినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యక్తి తన వాహనంలో రవాణా చేసే వస్తువులకు సంబంధించి ఇచ్చే రసీదు. ఇందులో వస్తువులు పంపే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి, రవాణా అవుతున్న వస్తువుల వివరాలతో పాటుగా సరుకు ఎక్కడి నుంచి బయలుదేరుతుంది, ఎక్కడకు రవాణా అవుతుందనే వివరాలు ఇందులో ఉంటాయి. కన్‌సైన్‌మెంట్ నోట్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉందంటే ఎప్పుడైతే ట్రాన్స్‌పోర్టర్ కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో.. ఆ వస్తువులకు సంబంధించిన పూర్తి బాధ్యత వస్తు విక్రయదారుని నుంచి ట్రాన్స్‌పోర్టర్‌కు బదిలీ అవుతుంది. ఆయా వస్తువులు గమ్యస్థానం చేరే వరకు వాటి సంరక్షణ బాధ్యత

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా..!

ఇదీ GST



రాంబాబు గొండాల

అతనిదే. కాబట్టి ఏ వాహనదారుడైతే కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో అతను మాత్రమే జీటీఏ కింద పరిగణించబడతాడు. అతను మాత్రమే జీఎస్‌టీ పరిధిలోకి వస్తాడు. అంటే రోడ్డు మీద ఉండే చిన్న వాహనాలు, ఆటో సర్వీస్‌లు జీటీఏ పరిధిలోకి రావు. ఎందుకంటే ఇవి సాధారణంగా ఎలాంటి కన్‌సైన్‌మెంట్ నోట్ ఇవ్వవు.

మరి జీటీఏ కిందకు వచ్చే వ్యక్తి ఎంత పన్ను కట్టాలి? జీటీఏకి సంబంధించి రెండు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాడుకుంటే 12 శాతం లేకుంటే 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది.

అయితే జీటీఏ ఈ కింది కేటగిరిలోని వ్యక్తులకు సర్వీస్ అందజేస్తే సదరు సర్వీస్‌ను రివర్స్ చార్జ్ కింద పరిగణించి ఆయా సేవలు అందుకునే వ్యక్తులు 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది. అవేమిటంటే.. ఏదేనీ ఫ్యాక్టరీ, సొసైటీ, కో-ఆపరేటివ్ సొసైటీ, జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులు, బాడీ కార్పొరేట్, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, క్యాజువల్ ట్యాక్సబుల్ పర్సన్ మొదలైనవి. అంటే, ఎప్పుడైతే ఒక జీటీఏ పైన తెలిపిన కేటగిరీలోని వ్యక్తులకు లేదా సంస్థలకు సరుకు రవాణా చేస్తేంటే.. ఆయా వ్యక్తులు లేదా సంస్థలు రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద 5 శాతం పన్ను చెల్లించాలి. ఇలాంటి సందర్భంలో జీటీఏకి ఐటీసీ పొందే అర్హత ఉండదు. అంటే వారు కొనే లారీల మీద లేదా ఇతర సర్వీసుల మీద ఐటీసీ పొందే అర్హత కోల్పోతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనంతట తానే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పన్ను 12 శాతం చొప్పున కట్టాలి. అంటే ఒక జీటీఏ తనంత తానే ట్యాక్స్ కట్టాలంటే (ఫార్వర్డ్ ట్యాక్స్ మెకానిజం) కచ్చితంగా 12 శాతం చెల్లించాలి. ఒకసారి ఈ విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో ఉండాలి.

అయితే 2022 జూలైలో దీనికి మళ్లీ సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఫార్వార్డ్ మెకానిజంలో రెండు రకాల ఆప్షన్స్ ఇవ్వటం జరిగింది. 5 శాతం, 12 శాతం అంటే జీటీఏ తనే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందాలంటే 12 శాతం ఎంచుకోవాలి. ఒకవేళ 5 శాతం ఎంచుకుంటే ఐటీసికి అర్హత ఉండదు. ఇది ఏదీ కాకుండా సర్వీస్ పొందిన వ్యక్తి పన్ను కట్టాలంటే ఆర్‌సీఎం విధానాన్ని ఎంచుకోవాలి. అప్పుడు కూడా ఐటీసీ అర్హత ఉండదు. మరి ఏ విధానం ఎంచుకున్నాడో ఎలా తెలవాలంటే.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాను ఎంచుకునే విధానానికి సంబంధించి అనెగ్జర్-V ను మార్చి 15లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాను ఏ పన్ను విధానాన్ని ఎంచుకుంటున్నది 2025 మార్చి 15లోపు తెలియజేయాలి. ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒకసారి ఒక విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో కొనసాగాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

వ్యక్తిగత రుణం తీసుకుంటున్నారా!

ఈ నిబంధనలు తెలుసుకోండి..



ప్రస్తుత ప్రపంచంలో ఎక్కువ మంది అప్పుల అప్పారావులే. ఖర్చులు ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఎవరైనా అప్పులు చేయక తప్పదు. ఆరోగ్య బీమా లేకుండా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇంటి రిపేర్లు, లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పదు. ఈ రోజుల్లో చేబదులు ఇచ్చే వాళ్లు తక్కువ. అప్పుడు వ్యక్తిగత రుణాలే గతి.

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి వ్యక్తిగత (పర్సనల్) రుణాలు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొద్దిగా రిస్క్ ఉన్నా వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఈ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాల్లో దాదాపు 36 శాతం ఈ రుణాలే. దీన్ని బట్టి బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎంత ఆసక్తితో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని అర్హతలకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. ఆ అర్హతలు ఏమిటో తెలుసుకుందాం.

రుణ అర్హతలు: వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రతి బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ అర్హతలు ఆయా సంస్థలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అయితే అన్ని సంస్థలు రుణం తీసుకునే వ్యక్తి కనీస ఆదాయం, క్రెడిట్ స్కోరు, వయసు, చేస్తున్న ఉద్యోగం, తీసుకునే రుణాన్ని ఎంత కాలంలో చెల్లిస్తాడు? అనే విషయాలను తప్పనిసరిగా చూస్తాయి. పై విషయాల ఆదారంగా వ్యక్తిగత రుణం తీసుకున్న వ్యక్తికి ఎంత రుణం మంజూరు చేయవచ్చు? ఆ రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించగలడా? లేదా? అనే అంశంపై బ్యాంకులు ఒక అవగాహనకు వస్తాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ చేశాయి. ఆయా బ్యాంకుల వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ కేవైసీ వివరాలు, కావాల్సిన ఈఎంఐ ప్లాన్ ఎంటర్ చేస్తే వ్యక్తిగత రుణ మంజూరుకు మీకు అర్హత ఉన్నదీ, లేనిదీ బ్యాంకులు వీలైనంత త్వరగా తెలియజేస్తాయి. ఈ రుణాల కనీస వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

ప్రధాన అర్హతలు

- 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి
- కనీస క్రెడిట్ స్కోర్ 700 పైన ఉండాలి
- ఉంటున్న నగరాన్ని బట్టి కనీస నెలవారీ ఆదాయం
- ఎన్నాళ్ల నుంచి ఆయా సంస్థల్లో పని చేస్తున్నారు
- స్వయం ఉపాధా లేక ఉద్యోగమా?
- ఇతర రుణాల చెల్లింపు భారమేమైనా ఉందా లేదా అనే అంశం

తెలుసుకోవడం ఎలా?

వ్యక్తిగత రుణాలకు మనకు అర్హత ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక ఫ్రీ టూల్స్ ఉన్నాయి. ఆ వెబ్‌సైట్లలోకి లాగిన్ అయి మీ వయసు, ఆదాయం, ఉద్యోగం, ఇప్పటికే ఉన్న అప్పుల వంటి వివరాలు నమోదు చేస్తే చాలు. మీరు ఎంత వ్యక్తిగత రుణానికి అర్హులో వెంటనే తెలిసిపోతుంది.

స్పోర్ట్స్

ఒలింపిక్ చాంపియన్‌కు ఆర్య జోడీ షాక్

వరల్డ్‌కప్‌లో స్వర్ణం కైవసం



మ్యూనిచ్: ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చిన భారత షూటింగ్ జోడీ ఆర్య బోర్స్-అర్జున్ బబుతా స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో శనివారం జరిగిన 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఆర్య-అర్జున్ జంట 17-7తో చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ ద్వయం జిఫీ వాంగ్-లిహావో షెంగ్‌ను చిత్తు చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్ (317.7 పాయింట్లు), ఆర్య (317.5)లు మొత్తం 635.2 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలవగా.. షెంగ్-వాంగ్ జంట 635.9 పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొన్నారు.

సఫారీలు సాధించారు

27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్ సొంతం

వరల్డ్ టెస్టు చాంపియన్‌గా దక్షిణాఫ్రికా

ఫైనల్లో ఆసీస్‌పై ఘన విజయం

ఏళ్లు కాదు.. దశాబ్దాలపాటు ఎదురుచూసిన తరుణమిది. తమ శక్తి యుక్తులన్నీ ధారపోసి పోరాడినా ఐసీసీ టోర్నీల్లో నిరాశగా వెనుదిరగడమే చూసిన దక్షిణాఫ్రికా ఇప్పుడు సగర్వంగా 'గద' ఎత్తుకుంది. ఒత్తిడికి చిత్తయ్యే జట్టంటూ.. చోకర్స్‌గా ముద్ర వేసి క్రీడాలోకం పరిహసించినా.. క్రికెట్ పుట్టినిల్లుగా భావించే లార్డ్స్‌లోనే 'ఇదిగో ఇదీ మా సత్తా' అంటూ వరల్డ్ టెస్టు చాంపియన్స్ హోదాలో పోడియంపై నిలిచింది. బలమైన ప్రత్యర్థి ఆసీస్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విలవిల్లాడిన బ్యాటర్లు లక్ష్య ఛేదనలో మాత్రం తెగించి నిలబడ్డారు. శతక వీరుడు మార్క్‌రమ్‌తో పాటు చీలమండ గాయం ఇబ్బందిపెట్టినా గెలుపు కోసం కెప్టెన్ బవుమా క్రీజులో నిలిచిన తీరుకు వహ్వా.. అనాల్సిందే. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీల్లో సఫారీలు విజేతలయ్యారు.



ప్రైజ్‌మనీ

దక్షిణాఫ్రికాకు - రూ. 31.05 కోట్లు

ఆస్ట్రేలియాకు - రూ. 18.63 కోట్లు

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 138 ఆలౌట్; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59); **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** 282/5 (మార్‌క్రమ్ 136, బవుమా 66; బెడింగమ్ 21; స్టార్క్ 3/66).

2 లార్డ్స్ మైదానంలో రెండో అత్యధిక ఛేదన (282)ను సాధించిన జట్టుగా సౌతాఫ్రికా. 1984లో ఇంగ్లండ్‌పై 342 పరుగుల ఛేదనతో విండీస్ టాప్‌లో ఉంది.

3 డబ్ల్యూటీసీలో వరుసగా మూడో సీజన్‌లోనూ కొత్త విజేత రావడం విశేషం. గతంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చాంపియన్స్‌గా నిలిచాయి.

దక్షిణాఫ్రికా ఆడిన ఐసీసీ ఫైనల్స్

టోర్నీ	ఏడాది	ప్రత్యర్థి
నాకౌట్ ట్రోఫీ	1998	విండీస్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్‌కప్	2023	ఆసీస్ చేతిలో ఓటమి
పురుషుల టీ20 వరల్డ్‌కప్	2024	భారత్ చేతిలో ఓటమి
మహిళల టీ20 వరల్డ్‌కప్	2024	కివీస్ చేతిలో ఓటమి
వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్	2025	ఆసీస్‌పై విజయం

4 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఆసీస్ ఓడడం ఇది నాలుగోసారి.

లండన్: రెండేళ్ల పాటు అద్భుత విజయాలతో సాగిన దక్షిణాఫ్రికా ప్రయాణం.. ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో ముగిసింది. శనివారం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన బవుమా సేన ఐసీసీ టెస్టు గదను సగర్వంగా అందుకుంది. అలాగే ఈ జట్టుకిది వరుసగా ఎనిమిదో టెస్టు విజయం కాగా.. 1998లో నాకౌట్ ట్రోఫీ తర్వాత రెండో ఐసీసీ టోర్నీ విజయం కావడం విశేషం. అటు ఇప్పటికే పది ఐసీసీ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఆసీస్ రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా నిరాశే ఎదురైంది. 2010 (టీ20 వరల్డ్‌కప్) తర్వాత కంగారూలు ఓ ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓడడం ఇదే తొలిసారి. నాలుగో రోజు కేవలం విజయానికి 69 పరుగుల దూరంలో నిలిచిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 282/5 స్కోరు సాధించారు. మార్‌క్రమ్ (136), బవుమా (66) గెలుపులో కీలక పాత్ర పోషించారు. స్టార్క్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకు ముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212, సౌతాఫ్రికా 138 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు సాధించిన ఆసీస్ ప్రత్యర్థి ముందు 282 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్‌క్రమ్** నిలిచాడు.

తొలి సెషన్‌లోనే..: నాలుగో రోజు 213/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా గెలుపునకు మరో 69 పరుగులే చేయాల్సివుంది. ఆసీస్ బౌలర్లు సఫారీలపై ఒత్తిడి పెంచేందుకు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు విసిరారు. వికెట్ల కోసం ఆసీస్ తమకున్న మూడు రివ్యూలను కూడా వాడేసుకుంది. కొత్త బంతిని సైతం తీసుకున్నా.. మొక్కవోని ఏకాగ్రతతో బ్యాటర్లు క్రీజులో నిలిచారు. తొలి సెషన్‌లో కేవలం మూడు బౌండరీలు మాత్రమే వచ్చాయి. అయితే మూడో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమాను కమిన్స్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ మార్‌క్రమ్ వారికి అడ్డుగా నిలిచాడు. స్టబ్స్ (8)తో కలిసి నాలుగో వికెట్‌కు 24.. బెడింగమ్ (21 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు జోడించాడు. గెలుపునకు మరో 6 పరుగుల దూరంలో అతడి 6 గంటల 23 నిమిషాల సుదీర్ఘ పోరాటానికి పేసర్ హాజెల్‌వుడ్ తెరదించాడు. మార్‌క్రమ్‌కు ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు లార్డ్స్ ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు. చివరకు 84వ ఓవర్‌లో స్టార్క్ వైడ్ ఫుల్‌టాస్‌ను కవర్ పాయింట్ వైపు వెరెయిన్ (4 నాటౌట్) సింగిల్ తీయడంతో దక్షిణాఫ్రికా అంతులేని సంబరాల్లో మునిగింది.



మార్‌క్రమ్

సరికొత్త అధ్యాయం

ఎన్నాళ్ల నిరీక్షణ.. ఎన్నేళ్ల నిర్వేదన..! కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓటములతో అభిమానుల కలలు కల్లలు కావడం.. జట్టు నైరాశ్యంలో మునిగిపోవడం. మొత్తంగా వెరసి 'అన్ లక్కీ' అనే ట్యాగ్‌ను సొంతం చేసుకొన్న జట్టు దక్షిణాఫ్రికా. చోకర్స్ (కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తయ్యే జట్టు)గా ముద్ర వేసుకొన్న సఫారీలు ఇప్పుడు చాంపియన్లుగా నిలిచారు.

దిగ్గజాల వల్ల కానిది..: ఏబీ డివిల్లీర్స్, గ్రేమ్ స్మిత్, గ్యారీ కిర్‌స్టెన్, అలెన్ డొనాల్డ్, జాక్ కలిస్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు జట్టు కోసం ఎంతో శ్రమించారు. వీరందరి కృషితో జట్టు మెరుగుపడినా.. ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షే అయింది. ఎట్టకేలకు మార్‌క్రమ్, బవుమా అద్భుత పోరాటంతో సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.

ఓటములను దిగమింగుకొని..: నాకౌట్స్‌లో నిరాశ.. సఫారీలకు 1992 నుంచి వెంటాడుతోంది. ఆ వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రూపంలో షాక్ తగిలింది. 1999 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ టై కావడం అనేది ఎప్పటికీ గుండెల్లో ముల్లులాంటిదే. గతేడాది జూన్ 29న జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా.. ఏడాది తిరిగే సరికి 'జూన్ 14'ను సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా మార్చుకొంది. కెరీర్ చివర్లో ఉన్న రబాడ.. ఫైనల్ మ్యాచ్‌లో కంగారూల పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన మార్‌క్రమ్.. భారీ శతకంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వీరిద్దరి పోరాట స్ఫూర్తితో సౌతాఫ్రికా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

రెండు దశలలో రంజీట్రోఫీ

దేశవాళీ టోర్నీలో మార్పులు

న్యూఢిల్లీ: ఈసారి రంజీ ట్రోఫీ (2025-26) అక్టోబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రెండు దశలలో జరగనుంది. ఈమేరకు శనివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అలాగే ఈ సీజన్ రంజీట్రోఫీలో మార్పులు కూడా చోటు చేసుకోనున్నాయి. వచ్చే సీజన్‌నుంచి ప్లేట్‌గ్రూపు నుంచి ఎలీట్‌కు ఒక్కోజట్టు మాత్రమే పదోన్నతి, రెలిగేషన్ అవనున్నాయి. రంజీ తొలి దశ అక్టోబరు 15 నుంచి నవంబరు 19 వరకు, రెండో దశ జనవరి 22 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహిస్తారు. నాకౌట్ ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు జరుగుతుంది. దులీప్ ట్రోఫీని ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 15 వరకు నిర్వహిస్తారు. ఇరానీ కప్ అక్టోబరు ఒకటి నుంచి 5 వరకు జరుగుతుంది. ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ లీగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. అలాగే ప్లేట్ గ్రూప్‌నూ పునఃపవేశపెడుతున్నారు.

హైదరాబాద్, విశాఖలో కివీస్ మ్యాచ్‌లు!

వచ్చే ఏడాది జనవరిలో మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. జనవరి 11 నుంచి 31 వరకు సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా జనవరి 11న జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలిసింది. రెండో వన్డే రాజ్‌కోట్ (జనవరి 14), మూడో వన్డే ఇండోర్ (జనవరి 18), తొలి టీ 20 నాగ్‌పూర్ (జనవరి 21), రెండో టీ20 రాంచి (జనవరి 23), మూడో టీ20 గువాహటి (జనవరి 25), నాలుగో టీ 20 విశాఖపట్నం (జనవరి 28), ఐదో టీ20 తిరువనంతపురం (జనవరి 31)లో జరగనున్నట్టు సమాచారం.

ప్రణతికి కాంస్యం

ఆసియా జిమ్నాస్టిక్స్



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రణతి నాయక్ ఆసియా సీనియర్ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ వాల్ట్ విభాగంలో కాంస్యం సాధించింది. దక్షిణకొరియాలోని జెచియాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో 30 ఏళ్ల ప్రణతి 13.466 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం దక్కించుకుంది. యిహాన్ ఝూంగ్ (చైనా, 13.650) స్వర్ణం, థీ క్విన్ (వియత్నాం, 13.583) రజతం నెగ్గారు. భారత్‌కే చెందిన ప్రొతిష్ఠ సమంత (13.016) నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆసియా స్థాయి పోటీలలో 3 పతకాలు అందుకున్న భారత జిమ్నాస్ట్‌గా ప్రణతి రికార్డుకెక్కింది. దీంతో దీపా కర్మాకర్ (రెండు పతకాలు)ను అధిగమించింది. 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రణతి కాంస్యాలు నెగ్గింది.

ఢిల్లీ చెస్ విజేత అభిజిత్



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ చెస్ టైటిల్‌ను భారత జీఎం అభిజిత్ గుప్తా (8.5 పాయింట్లు) సొంతం చేసుకున్నాడు. 9వ రౌండ్‌లో మిహాయిల్ (బెలారస్)పై కీలక విజయం సాధించిన అభిజిత్.. ఇంటర్నేషనల్ మాస్టర్ అరోనిక్ ఘోష్‌తో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. నికీ టిస్కో (బెలారస్) రెండో, భారత గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్ మూడో స్థానంలో నిలిచారు.

'బన్నీ హాప్స్' క్యాచ్‌లు కుదరవు..

దుబాయ్: బౌండరీల దగ్గర పట్టే 'బన్నీ హాప్స్' క్యాచ్‌ల విషయంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాచ్ విషయంలో ఫీల్డర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటే మైదానంలో ఉన్నప్పుడే బంతిని పైకి విసిరి.. లైన్ దాటి తిరిగి లోనికి వచ్చే అందుకోవాల్సి ఉంటుంది. అంటే బౌండరీ బయట బంతిని పలుమార్లు ఎగర వేయడం కుదరదు. ఈనెల నుంచే కొత్త రూల్ ఐసీసీ ప్లేయింగ్ కండిషన్‌లో భాగం కానుండగా.. వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఎంసీసీ రూల్ ఆఫ్ లాలో అధికారికంగా చేరుస్తారు. మరోవైపు వన్డేల్లో రెండు కొత్తబంతుల నిబంధనల్లో మార్పు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ ప్రొటోకాల్‌ను ఐసీసీ ఆమోదించింది.

కాసులు కురిపిస్తున్న పసుపు



- వెయ్యి ఎకరాలకు పైగా సాగు..
- ఎకరాకు లక్ష రూపాయల దాకా ఆదాయం
- రైతుల్లో ఆనందం

రాజంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పసుపు పంట రైతులకు కాసులు కురిపించింది. సిద్ధవటం మండలంలోని బాకరాపేట, సిద్ధవటం, మంటపంపల్లె, ఒంటిమిట్ట మండలంలోని ఒంటిమిట్ట, మంటపల్లె తదితర 30 గ్రామాల్లో ఈ ఏడాది వెయ్యి ఎకరాలకు పైగా పసుపు సాగు చేశారు. ఏప్రిల్ నుంచి మే మాసాంతానికి పంట చేతికొచ్చింది. అన్ని ఖర్చులు పోను ఎకరాకు లక్ష రూపాయలు పైగా ఆదాయం వచ్చింది.. మార్చి నుంచి ఏప్రిల్ వరకు పసుపు విత్తడం ప్రారంభిస్తారు. ఇంటిల్లిపాది కష్టపడడంతో పాటు విత్తడం, ఎరువులు, కలుపు, పురుగుమందుల పిచికారీ తదితరాలకు ఎకరాకు సుమారు 60 వేల వరకు ఖర్చు చేస్తారు. వేసవి నాటికి పంటకాలం పూర్తవుతుంది. ఆ సమయంలో పసుపు దుంపలను ప్రాసెస్ చేసి, ఎండబెట్టి కడప, ప్రొద్దుటూరు, తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల్లోని మార్కెట్‌కు తరలిస్తారు. ఈ మధ్య కాలంలో వివిధ కారణాలతో పసుపు సాగు విస్తీర్ణం తక్కువ కావడంతో డిమాండ్ పెరిగి పోయింది. దీనికి తోడు ఒక్కో ఎకరాకు 40 నుంచి 80 పుట్ల (ఒక పుట్టి = 240 కిలోలు) వరకు పంట దిగుబడి వచ్చింది. ప్రస్తుతం ఒక్కో పుట్టి రూ. 4100 నుంచి రూ. 4500 వరకు ధర పలికింది. దీంతో ఖర్చులు 60 వేలు పోను, ఎకరాకు లక్ష రూపాయలకు పైగా ఆదాయం వచ్చింది. . ప్రతి ఏడు ప్రకృతి వైపరీత్యాల కారణంగా భారీగా నష్టపోతున్న రైతుకు పసుపు సాగుతో కొంత ఊరట లభించింది.



పసుపు దుంపలను ఉడకబెడుతున్న రైతులు

మూడేళ్లుగా లాభాలొస్తున్నాయి



మూడేళ్లుగా పసుపు సాగుతో లాభాలు వస్తున్నాయి. రెండెకరాల్లో పసుపు సాగు చేశాను. నా వరకు రెండెకరాలకు రూ. 2 లక్షలదాకా ఆదాయం వచ్చింది. గత ఏడాది కూడా ఇదేవిధంగా లాభం వచ్చింది.

- కె.శ్రీనివాసులునాయుడు, పసుపు రైతు

హోరాహోరీగా అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీలు

- 110 పరుగుల ఆధిక్యంతో చిత్తూరు, అనంతపురం జట్ల గెలుపు

కడప స్పోర్ట్స్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-19 పురుషుల అంతర్‌జిల్లాల ఒకరోజు క్రికెట్ పోటీల్లో శనివారం రెండు వేర్వేరు జట్లు తమ ప్రత్యర్థి జట్లపై 110 పరుగుల తేడాతో విజయం సాధించాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో..

నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో టాస్‌నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 46.2 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో నెల్లూరు జట్టు బౌలర్ భార్గవ్‌మహేష్ 5 వికెట్లు సాధించగా, సోహన్‌రెడ్డి 110 పరుగులు చేసి భారీ స్కోర్ సాధించేందుకు దోహదపడ్డాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 31.5 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. ఈ జట్టు క్రీడాకారుడు ఎస్. హమీద్ 60 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో చిత్తూరు జట్టు 110 పరుగుల భారీ స్కోర్ తేడాతో గెలుపొందింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో

నగర శివారులోని కేఎస్ఆర్ఎం మైదానంలో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 283 పరుగులు సాధించింది. ఇందులో రెహన్ 117 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 31.3 ఓవర్లలో 173 పరుగులకు కుప్పకూలింది. ఇందులో ఓంకార్ 57 పరుగులు చేశాడు. మిగతా బ్యాట్స్‌మెన్స్ అలా వచ్చి ఇలా వెళ్లారు. బౌలింగ్ విభాగంలో అనంతపురం జట్టు బౌలర్ ఏ. నిషే 5, టి.వి. సాయిప్రతాప్‌రెడ్డి 5 వికెట్లు సాధించారు. దీంతో 110 పరుగుల భారీ స్కోర్‌తో అనంతపురం జట్టు విజయం సాధించింది.

ప్రభుత్వ ఆసుపత్రికి తాళం.. ఎమ్మెల్యే ఆగ్రహం!

మైదుకూరు రూరల్ ,జూన్ 14(ఆంధ్రజ్యోతి) :ప్రజలకు సేవ చేసే సిబ్బంది కావాలి కానీ, జీతాల కోసం పనిచేసే వారు అవసరం లేదని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మండిపడ్డారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.
పనివేళల్లో తాళాలు వేసి ఉండటంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. వెంటనే జిల్లా వైద్య అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, భీమయ్య, శీర్ల నాగమోహన్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రికి వేసిన తాళాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

ఆలయ అభివృద్ధికి విరాళం

పెండ్లిమర్రి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):నందిమండలం సమీపంలోని గంగమ్మ ఆలయ అభివృద్ధికి శనివారం కొత్తూరుకు చెందిన రాజశేఖర్‌రెడ్డి రూ.2లక్షలు, సోమా రామసుబ్బిరెడ్డి రూ.30వేలు విరాళం ఇచ్చినట్లు ఈఓ మారుతి ప్రసాద్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని తెలిపారు.

నీట్ ఫలితాల్లో ఆకాష్ విజయ దుందుభి



విద్యార్థులను అభినందిస్తున్న ఆకాష్ అధ్యాపక బృందం

కడప ఎడ్యుకేషన్,జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష ఫలితాల్లో ఆకాష్ విద్యాసంస్థ విజయదుందుభి మోగించిందని ఆకాష్ విద్యాసంస్థల బ్రాంచ్ మేనేజర్ సుధాకర్‌రావు తెలిపారు.ఆలిండియా స్థాయిలో బి.డింపుల్ 533, బి.మోక్షిత 521 ర్యాంకులు సాధించి టాపర్‌గా నిలిచారన్నారు. అబ్దుల్ రెహమాన్, బాలాజి, జాహ్నవి, హర్షిత మెరుగైన ర్యాంకులు సాధించారని చెప్పారు. విద్యార్థులను ఆకాష్ విద్యాసంస్థరాష్ట్ర ప్రతినిధులు నారాయణ మూర్తి, నిశాంత్‌మిశ్రా, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్, ఏరియా సేల్స్ హెడ్ నరసింహులు, అకాడమిక్ హెడ్ ఆప్సర్ బాష సుబ్రమణ్యం అభినందించారు.

భార్య కళ్లెదుటే కడతేరిపోయిన భర్త

- రోడ్డు ప్రమాదంతో విషాదం

కలకడ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో ఉన్న కుమారుడిని చూసేందుకు భార్యతో కలిసి బయలుదేరిన ఓ తండ్రి రోడ్డు ప్రమాదంలో విగతజీవుడైన సంఘటన శనివారం రాత్రి కలకడ వద్ద జరిగింది. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఉన్న హంద్రీ-నీవా కాల్వ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శంకు శ్రీనివాసులు(50) మృతి చెందారు. సంబేపల్లె మండలం శెట్టిపల్లె జంగంపల్లెకు చెందిన శ్రీనివాసులు, తన భార్య సుశీలతో కలిసి కలికిరి మండలం కొట్టాల పంచాయతీ నడింపల్లెలో ఉన్న కుమారుడి వద్దకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో కలకడ మండలం బాటవారిపల్లె వద్దనున్న హంద్రీ-నీవా కాల్వ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో అదుపు తప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సుశీల ప్రాణాలతో బయటపడింది. కలకడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. రెప్పపాటులో జరిగిన ప్రమాదంలో భర్త కడతేరిపోవడంతో సంఘటనా స్థలంలో సుశీల రోధనలు అందరి హృదయాలను కలిచి వేసింది.

నాటు సారా బట్టీలు ధ్వంసం

- ఇద్దరిపై కేసు నమోదు
- 330 లీటర్ల ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో ఎక్సైజ్ సిబ్బంది

పీలేరు రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కలకడ మండలం ఎనుగొండ పాళ్యం దిగువ తాండా పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి నాటుసారా బట్టీలను ధ్వంసం చేసినట్లు పీలేరు ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం పీలేరు, కలకడ మండలాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించామన్నారు. కలకడ మండలం ఎగుగొండపాళ్యం దిగువతాండా వద్ద బట్టీలతోపాటు 330 లీటర్ల ఊటను ధ్వంసం చేసి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దిగువ తాండాకు చెందిన శశినాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎలేరు మండలం జంగంపల్లె వద్ద భాగ్యమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకుని 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎవరైనా నాటు సారా తయారీ, తరలించడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో రాయచోటి, పీలేరు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా విక్రేత అరెస్టు



పట్టుబడిన మహిళతో ఎక్సైజ్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెన్నరాజుపోడు క్రాస్ రోడ్డు వద్ద నాటు సారా విక్రయిస్తున్న పాలెంకోట లక్షుమ్మ అనే మహిళను శనివారం అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు. ఆమె నుంచి పది లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు మధుసూదన్‌రాజు, సోమేశ్వర్, బసిరెడ్డి, రమణారెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ



చోరీ తీరు పరిశీలిస్తున్న పోలీసులు

రైల్వేకోడూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో శనివారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. ఉదయాన్నే తలుపులు తెరిచేందుకు వెళ్లిన దుకాణదారు తాళాలు పగులగొట్టి ఉండడం గుర్తించాడు. తలుపులు తెరవకుండానే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి పరిశీలించారు. దొంగలు దుకాణంలోని వస్త్రాలతో పాటు, రూ. 70 వేలు నగదు దోచుకుని వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో డ్రైవర్ అరెస్టు



అరెస్టు చేసిన డ్రైవర్‌ను చూపుతున్న పీటీఎం పోలీసులు

పెద్దతిప్పసముద్రం జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వాహనంతో ఇద్దరు యువకులను ఢీకొని వారి మృతికి కారణమైన కేసులో వాహన డ్రైవర్‌ను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ హరిహర ప్రసాద్ తెలియజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పీటీఎం ఎస్సీ కాలనీకి చెందిన దండు శంకర కుమారుడు శ్రీనివాసులు (22), సాదిలి గంగాద్రి కుమారుడు చందు (22) మార్చి 18వ తేదీ రాత్రి బి.కొత్తకోటలో సెకండ్‌షో సినిమాకు వెళ్లి వస్తుండగా పీటీఎం సమీపంలోని వెంకటేశ్వర కోళ్ల ఫారం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ కేసు దర్యాప్తు చేసిన పీటీఎం పోలీసులు ఈ ప్రమాదానికి సిమెంట్ మిక్సర్ వాహనం కారణంగా గుర్తించారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన ఆ వాహన డ్రైవర్ జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దావరిక యాదవ్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.

హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్ట్



హత్యాయత్నం కేసులో నిందితులతో పోలీసులు

ఓబులవారిపల్లె, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు చిన్నరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై దాడిచేసిన కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తల్లెంవారిపలెకు చెందిన చిన్నరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై దాడి చేసి తల, ఒంటిపై గాయాలు చేసిన అదే గ్రామానికి చెందిన కొలవల అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డిని జీవీపురం పరిధిలో అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. గ్రామాల్లో సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీట్ ఫలితాల్లో కడప 'నారాయణ' హవా



విద్యార్థులను అభినందిస్తున్న కోర్ డీన్ చంద్రకిశోర్‌రెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష ఫలితాల్లో కడప తమ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ పరీక్షలలో కడప నారాయణ కళాశాల విద్యార్థులు ఎం.పల్లవి ఆలిండియా స్థాయిలో 743 ర్యాంకు, కె.రమ్యసాయి 16,344, ఎం.జోషిణి 18,562, ఎస్.మహమ్మద్ అమీన్ 19,986, ఎస్.సలేహా 30,074, కె.సందూరి 36,184, బి.సహస్ర 41,549, జి.లక్ష్మిచైతన్య 44,990, జి.ఆఫ్రిన్ భాను 56369 ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులు తమ పట్టుదలతోను తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఈ ఘన విజయం సాధించారని తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కోర్ డీన్ చంద్ర కిశోర్‌రెడ్డి, డీన్ సుబ్బారావు, బాలవెంకటరెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ మురళిమోహన్, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, రాఘవరెడ్డి, సుమన్ అభినందించారు.

శ్రీచైతన్య సంచలనం



విద్యార్థులతో శ్రీచైతన్య అధ్యాపక బృందం

కడప ఎడ్యుకేషన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఏ ప్రకటించిన నీట్ ఫలితాలలో శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారని ఏటీఎం బీవీ ప్రసాద్ తెలిపారు. నీట్ పరీక్షలో శ్రీచైతన్య తిరుపతి శాఖకు చెందిన విద్యార్థులు ఆరుష్ లక్ష్మణ్, జాతీయస్థాయిలో 337వ ర్యాంకు, వి.యశ్వంత్ 1042, వి.దేవేంద్రన్ 1365, ఎన్.హరిత 2121, వివిఎల్ హర్షిత 2277, కె.టీనారాణి 2368, జి.గుణభూషణ్ 2460, వై.దీక్షిత 2695, వై.మహతి 3723, వై.శివకృతిక్ 4126, కె.హర్షిత 429, కె. కల్పన 4824 వంటి టాప్ ర్యాంకులతో పాటు జాతీయస్థాయిలో 10వేల లోపు ర్యాంకులు 28మంది, 20వేల లోపు ర్యాంకులు 46 మంది, వివిధ కేటగిరీల నుంచి సుమారు 120 మంది వరకు ఎంబీబీఎస్ సీట్లు సాధించగలిగే ర్యాంకులు సాధించి రాయలసీమలోనే మరి ఏ ఇతర విద్యాసంస్థకు సాధ్యం కాని స్థాయిలో మరొకసారి శ్రీచైతన్య అగ్రగామిగా నిలిచిందన్నారు. విద్యార్థులను డైరెక్టర్లు సుష్మశ్రీ, నాగేంద్రలు అభినందించారు.

స్వదేశానికి రప్పించాలంటూ కువైత్ నుంచి మహిళ వేడుకోలు



వీడియోలో విలపిస్తున్న పుష్ప

పీలేరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కువైత్ నుంచి తనను స్వగ్రామానికి రప్పించాలంటూ కేవీపల్లె మండలం గ్యారంపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన పుష్ప అనే మహిళ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. కువైట్‌లో తాను ఉంటున్న ఇంటి బాత్రూం నుంచి తాను వీడియో చేస్తున్నానంటూ ఆమె తెలిపారు. గ్యారంపల్లె కురవపల్లెకు చెందిన తాను పీలేరుకు చెందిన ఏజెంట్ల ద్వారా కువైట్‌కు వచ్చానని, తనకు చెప్పిన పని ఇవ్వకుండా ఇతర పనులు చెబుతున్నారని, వారి మాట విననందుకు హింసిస్తున్నారని, తనను చంపేస్తారేమోనన్న భయం కూడా ఉందని విలపించింది. ఈ వీడియో శనివారం సాయంత్రం సామాజిక మాధ్యమాలలో వైరలయ్యింది. గ్యారంపల్లె కురవపల్లెకు చెందిన కృష్ణయ్య, పార్వతమ్మల కూతురు పుష్ప రెండు నెలల క్రితం కువైట్‌కు వెళ్లింది. భర్త నుంచి విడాకులు తీసుకోవడంతో ఇద్దరు పిల్లలను పోషించుకునేందుకు ఆమె కువైట్‌కు వెళ్లిందని ఆమె బంధువులు తెలిపారు. అయితే, తాను అక్కడ ఉండలేనని తనను పిలుపించుకున్న ఏజెంట్లకు చెప్పానని, రెండు వేల దీనార్లు చెల్లించి స్వదేశానికి వెళ్లిపోవచ్చునని వారు తెలిపారని, తన వద్ద అంత డబ్బు లేదన్నారు. గతంలో తనలాంటి వారినెందరినో కాపాడిన నారా లోకేశ్, తనను కూడా కాపాడాలని కోరింది. ఆయన స్పందించకుంటే తనకు మరణమే శరణమని వాపోయింది. ఈ విషయమై కేవీపల్లె ఎస్ఐ చిన్న రెడ్డయ్య మాట్లాడుతూ పుష్ప దీనస్థితి తెలిసింది, ఆమెను స్వదేశానికి రప్పించే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్లు..!

- రీ సర్వేలో రెవెన్యూ.. కనికట్టు!
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

చక్రాయపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రీసర్వేతో ఉత్పన్నమైన సమస్యలు కూటమి ప్రభుత్వంలో పరిష్కారమవుతాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ఈ ప్రభుత్వం కూడా అదే మార్గంలో నడుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు చూపడంలో అధికారులు ఆరితేరిపోయారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
మండలంలో రీసర్వే కారణంగా సుమారు 60 మందికి పైగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. యార్లవాండ్లపల్లెలో నాగయ్య అనే రైతుకు 2.30 ఎకరాల భూమి ఉండగా రీ సర్వేలో 30సెంట్లు మాత్రమే ఉన్నట్లు తేల్చారు. పెద్దింటి రామచంద్రకు 2.69 ఎకరాలుండగా 45 సెంట్లు ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో ఈయన కలెక్టర్‌కు ఫిర్యాదుచేయగా, అక్కడి నుంచి తక్షణం తహసీల్దార్‌కు ఫోన్ వచ్చింది. ఇప్పటికి రెండేళ్లు అవుతున్నా ఇంతవరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. చక్రాయపేట గ్రామంలో గంగులయ్య అనే వ్యక్తికి 1,679 ఎకరాల భూమి ఉన్నట్లు చూపారు. పోతుల చెన్నయ్య, మేకల చిన్నగంగయ్య, గంగులయ్య, నాగశివ, చిన్నయ్య, బాలిరెడ్డి, తిమ్మారెడ్డిగారిపల్లెకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, లక్ష్మినారాయణ, కృష్ణవేణి, ఇసుక చింతలపల్లెకు చెందిన కృష్ణవేణి, సహదేవరెడ్డి తదితరుల భూముల వివరాలు కూడా తారుమారయ్యాయి. ఇలా చెప్పుకొంటూ పోతే వందల మంది రీసర్వే బాధితులు ఉన్నారు. ఈ నేపథ్యంలో 1బి, అడంగల్ రాకపోవడంతో బ్యాంకుల్లో రుణాలు రెన్యువల్ చేసుకోలేక ఇబ్బందిపడుతున్నారు. ఉన్నతస్థాయి అధికారులు కానీ, కలెక్టర్ గాని స్పందించి మండలంలో రీసర్వేతో నష్టపోయిన తమను వెంటనే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఒక సర్వే నెంబర్‌కు మూడు ఖాతాలు:

ఒక రైతుకు సంబంధించిన ఖాతాలో ఎన్ని సర్వేనెంబర్లు అయినా ఉండవచ్చు. అందుకు విరుద్ధంగా ఒక సర్వే నెంబర్‌కు మూడు ఖాతాలు ఇచ్చిన దాఖలాలు చక్రాయపేట మండలంలో కనిపిస్తున్నాయి. ఒక సర్వే నెంబర్‌కు నాలుగైదు ఖాతాల నెంబర్లు ఇవ్వడం మరీ దారుణమని రైతులు ఆరోపిస్తున్నారు.

కూలి చేసుకుని బతుకుతున్నా..



గ్రామ సమీపంలో నాకు 2.30 ఎకరాలు ఉండగా కేవలం 30 సెంట్లు మాత్రమే కనిపిస్తోంది. ఈ విషయం రెవెన్యూ అధికారులను అడిగినా పలకడం లేదు. లోను రెన్యువల్ చేసుకోలేక జీవనం కష్టం అయిపోయింది. కూలినాలి చేసుకొని బతుకుతున్నా.. నామొర ఆలకించేనాథుడే లేడు.

- నాగయ్య,యార్లవాండ్లపల్లె

2.60 ఎకరాలు కనిపించడం లేదు



మా భార్య కృష్ణవేణికి చెందిన 2.60ఎకరాలు భూమి రికార్డుల్లో కనిపించడం లేదని రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. సంక్షేమ పథకాలు అందడం లేదు. రుణాలు రెన్యువల్ చేసుకోలేకపోయాం. కలెక్టర్ స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.

- లక్ష్మినారాయణ, తిమ్మారెడ్డిగారిపల్లె

ఆఖరి మజిలీకి అతనొక్కడే

పాడె కట్టాలంటే దాస్ రావాల్సిందే ● అందరివాడు రాందాస్ ● 45ఏళ్లుగా అదే వృత్తిగా జీవనం

ఎవరైనా చనిపోతే ఆయింటి వద్దకు వెళ్లాలన్నా, అంత్యక్రియల్లో పాల్గొన్నాలన్నా చాలా మంది ఒకింత ఇబ్బంది పడుతుంటారు. కుటుంబీకులు, మృతుల బంధువులు కూడా పాడె సామాను తీసుకురావాలన్నా ముందుకురారు. అయితే ఇటువంటి పనులను సైతం తనభాగ్యం అంటూ నీరుగట్టి రాందాస్ పరుగుపరుగున సేవలు అందిస్తుంటాడు. ఈ సమయంలో ఇచ్చేది తృణమో, ఫలమో తృప్తికొద్దీ తీసుకుంటాడే తప్ప ఇంకా కావాలని కోరడు అదే రాందాస్ నైజం. అందుకే రాందాస్ అందరివాడిగా నిలిచాడు. వివరాల్లోకెళితే...

వాల్మీకిపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాందాస్ పేరు చెప్పగానే తెలియని వారు ఉండరు. స్థానిక గాంధీపేట వాసి 62 ఏళ్ల రాందాస్ అందరి వాడిగా నిలిచాడు. పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్లో సైతం ఎక్కడైనా సరే హిందువులు మరణిస్తే రాందాస్ సేవలు తప్పనిసరి. అంత్యక్రియలకు తొట్టతొలిగా గుర్తుకు వచ్చే వ్యక్తి రాందాస్ అనే చెప్పాలి. 45ఏళ్లగా ఇదే వృత్తిగా అంత్యక్రియల్లో రాందాస్ సేవలు అందిస్తుంటాడు. ఇందుకు అవసరమయ్యే సామగ్రి తనకు తానుగా సమీప



పాడెను సిద్ధం చేస్తున్న రాందాస్

వ్యవసాయ పొలాలు తదితర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవడం, మరణించిన వ్యక్తి అంతిమ యాత్రకు పాడెను సిద్ధం చేయాలన్నా దాస్ రావాల్సిందే. ఆ సమయంలో స్థానికులు తనను ఆశ్రయించినా సేవల విషయంలో ఎవరినీ ఇబ్బంది పెట్టకపోగా వారు ఇచ్చిన దాంతో సంతృప్తి చెందుతుంటాడు. గొప్ప కార్యంలో ఆఖరి మజిలీ సమయాన స్థానికులంతా తనను ఆశ్రయించడం వారికి చేసే సేవల పట్ల కూడా సంతృప్తి చెందుతుంటాడు. ఊరి మొత్తానికి ఒకేఒక్కడుగా సేవలందిస్తున్న రాందాస్ అందరికీ సుపరిచితుడే. నిరుపేద కూలి జీవనంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న రాందాస్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నప్పటికీ ఇదే వృత్తిలో జీవనం సాగిస్తుండడం గమనార్హం. అంతేకాకుండా తనకు తానుగా అలవర్చుకున్న మిమిక్రీతో పిల్లలను సైతం అలరిస్తూ ఆటపట్టిస్తుంటాడు. పలువురు స్థానికులు మాట్లాడుతూ ఎంతో కాలంగా దహన సంస్కారాల్లో దగ్గరుండి సేవలందించే రాందాస్‌ను గొప్పగా కొనియాడారు. ఇదే వృత్తిగా జీవనం సాగిస్తున్న రాందాస్ శభాష్ అంటూ స్థానికులతో పాటు సమీప గ్రామాల ప్రజలు కూడా ప్రశంసిస్తారు.

45ఏళ్లుగా ఇదే వృత్తితో జీవనం

సుమారు 45ఏళ్లుగా పట్టణంలో ఇదే వృత్తితో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఊర్లో, పల్లెల్లో ఎవరైనా చనిపోతే వేకువజామునే మా ఇంటి వద్దకు వస్తుంటారు. దహన క్రియల్లో నేనే ముందుండి పాడె కట్టి అవసరమైన సేవలు చేస్తుంటాను. ఆ సమయంలో సంబంధిత వ్యక్తులు ఇచ్చే తృణమో ఫలమో సంతోషంగా తీసుకుంటా. ఈ జన్మకు ఈ సేవచేయడం ఆ దేవుడిచ్చిన వరం అనుకుంటా. అందరూ రాందాస్ రాందాస్ అని పిలుస్తుంటే నిజంగా చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. ప్రాణమున్నంత వరకు నావంతుగా అందరికీ సేవలు చేస్తా.



నీరుగట్టి రాందాస్, గాంధీపేట

కష్టం తెలిసిన నేత చంద్రబాబు



వాల్మీకిపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు, మహిళలు

వాల్మీకిపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుపేద ప్రజల కష్టం తెలిసిన నిజమైన నేత సీఎం నారా చంద్రబాబు నాయుడు అని వాల్మీకిపురం మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి అన్నారు. శనివారం స్థానిక నెహ్రూ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తల్లికి వందనం కార్యక్రమంపై విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ జై చంద్రబాబు నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా తల్లికి వందనం పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తూ నిరుపేద కుటుంబాల పిల్లలకు వారి తల్లుల ఖాతాలో నగదు జమచేయడం హర్షణీయమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పేరుతో ఎందరో పిల్లలకు వంచన చేశారని అలా కాకుండా పాఠశాలలో చదువుకునే విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకం పూర్తిస్థాయిలో మంజూరు చేయడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కష్టాల గుర్తించి పిల్లల భవిష్యత్తుకు తోడ్పాటునిస్తున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మెన్ శీను, నేతలు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, కోసూరి రమేష్, మురళి, కేకేనాయుడు, సయ్యద్‌అమీర్, ఆదినారాయణ, దండువారిపల్లె రమణ కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లికి వందనం లబ్ధిదారుల ధన్యవాదాలు

బి.కొత్తకోట, జూన్14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమకావడంతో లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ఒకే బిడ్డకు నగదు పడేది. సూపర్‌సిక్స్ హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం ఎంతమంది పిల్లలుంటే అందరికీ పథకంలో భాగంగా రూ.26, 39, 56000 వేలు తల్లుల ఖాతాల్లో పడడంతో చంద్రబాబు మాట నిలపెట్టుకున్నారన్నారు. వీధుల్లో ఎక్కడ చూసినా లబ్ధిదారుల సంబరాలు కనిపించాయి. టీడీపీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ఎండీ మస్తాన్ శనివారం పట్టణంలోని పలువురు లబ్ధిదారుల కుటుంబాలను కలిశారు. ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకం పేదవిద్యార్థులకు వరం అని, నగదు పొందిన తల్లీ పిల్లల ఆనందం ముందు వైసీపీ చేసే చౌకబారు విమర్శలు గాలికి పోయాయన్నారు.

బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చౌడసముద్రంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

మొలకలచెరువు జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చౌడసముద్రంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ దాసిరిపల్లె జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీలో తల్లికి వందనం పథకంలో భాగంగా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పిల్లలందరికీ పథకం డబ్బులు జమ అయ్యాయి. దీంతో టీడీపీ నేతలు, మహిళలు కేక్ కట్ చేసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చాంద్‌బాష, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుధాకర్, మాజీ ఎంపీపీ నరసింహులు, నాయకులు బుర్రా రమణ, అల్లాబకర్, సత్తార్, ఫక్రుద్దీన్, భాస్కర్ నాయక్, కృష్ణప్ప నాయుడు, పురుషోత్తం నాయుడు, చలపతి నాయుడు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన 52 మంది యువకులు



గుర్రంకొండలో రక్తదానం చేస్తున్న యువకులు

గుర్రంకొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గుర్రంకొండలో 52 మంది యువకులు శనివారం రక్తదానం చేశారు. మదనపల్లెకు చెందిన హెల్పింగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుర్రంకొండకు చెందిన 52 మంది యువకులు రక్తదానం చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్ధిక్ మాట్లాడుతూ ప్రతి యువకుడు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ముఖద్దర్, ఆబిద్, యతీష్, అర్షద్, ముష్రాప్, కిరణ్, సాంబ, జయేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

తంబళ్లపల్లె, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి సూచిం చారు. నూతన ఎస్ఐ శనివారం కురవపల్లె బస్టాప్ వద్ద సిబ్బందితో కలిసి విస్తృతంగా వాహన తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని, వాహనాల ధృవపత్రాలు, లైసెన్సులు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాల ని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ద్విచక్రవాహన దారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు ధరించి ప్రయాణిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాహనాలు నడుపుతూ మైనర్లు పట్టుబడితే తల్లితం డ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

మదనపల్లె టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ అంకయ్య(30) మృతి చెందగా, మనస్థాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ లోకేశ్(31) మృతి చెందారు. నెల్లూరు జిల్లా కలువాయికి చెందిన బుడ్డయ్య కుమారుడు అంకయ్య రెండేళ్ల కిందట కలకడ మండలంలో బొగ్గు కాల్చే పనికి కుదిరాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గుర్రంకొండకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మదనపల్లె పట్టణం రామ్‌గోపాల్‌నాయుడు వాసి ఆదినారాయణ కుమారుడు లోకేశ్ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల కిందట మనస్థాపం చెంది శనివారం క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా, పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ లోకేశ్ మృతి చెందాడు. పోలీసులు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి, కుమార్తె ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో తల్లి, కుమార్తె ఆత్మహత్యకు యత్నించారు. వెలిగల్లు పంచాయతీ పడమటవారిపల్లె వాసి నాగిరెడ్డి భార్య జానకమ్మ, అతని కుమార్తె వర్షారెడ్డి ఉన్నారు. కొంత కాలంగా నాగిరెడ్డి కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడని మనస్థాపం చెందిన జానకమ్మ తాను విషం తాగి, కుమార్తెకు తాపించింది. కాగా ఎక్కువ మోతాదులో విషం తాగిన జానకమ్మ అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు ఇద్దరినీ మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జానకమ్మ పరిస్థితి విషమంగా వుండడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. పెద్దమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లికి వందనం వర్తింపజేయాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ ● సబ్‌కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ - మున్సిపల్ ఆఫీసు వద్ద సీఐటీయూ నిరసన





సబ్‌కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ, మున్సిపల్ ఆఫీసు వద్ద సీఐటీయూ నేతల నిరసన

మదనపల్లె టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకాన్ని మున్సిపల్ కార్మికుల పిల్లలకు కూడా వర్తింపజేయాలని సబ్‌కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ, మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ నేతలు నిరసన తెలిపారు. సబ్‌కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసనలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మదనపల్లె కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, చలపతి నాయుడు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితి లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చాయన్నారు. కానీ ఆచరణలో మాత్రం మున్సిపల్ కార్మికుల పిల్లలకు మొండిచెయ్యి చూపిస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల పిల్లలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ, సీపీఐ నేతలు తిరుమల, దేవా, వాసు, ఇంద్రాణి, శ్రీనివాసులు, నరసింహులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

తల్లికి వందనం పథకాన్ని మున్సిపల్ కార్మికుల పిల్లలకు కూడా వర్తింపజేయాలని సీఐటీయూ కన్వీనర్ పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ నేతలు నిరసన తెలిపారు. రామకృష్ణ మాట్లాడుతూ కుటుంబంలో ఎంత మంది పిల్లలు వున్నా అందరికీ తల్లికివందనం పథకాన్ని వర్తింపజేస్తామని ప్రభుత్వం అంటోందని, వాస్తవంగా అందుకు భిన్నంగా ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మున్సిపల్ కార్మికుల పిల్లలకు వెంటనే తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్‌లో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఐఎన్ఓ ఏపీ రాష్ట్ర కోకన్వీనర్‌గా డాక్టర్ లక్ష్మి



పీలేరు రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ న్యాచురోపతి ఆర్గనైజేషన్ (ఐఎన్ఓ) రాష్ట్ర కో కన్వీనర్‌గా పీలేరుకు చెందిన డాక్టర్ పీ.వీ.ఎస్. లక్ష్మిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ఆమె మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025ను పురస్కరించుకుని ఇంటర్నేషనల్ న్యాచురోపతి ఆర్గనైజేషన్, సూర్య పౌండేషన్ తాను అనేక ఏళ్లుగా యోగా రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా అందిస్తున్న విశిష్ఠ సేవలను గుర్తించి రాష్ట్ర కో కన్వీనర్‌గా నియమించినట్లు చెప్పారు. పదేళ్లగా యోగా ఆవశ్యకతను వివరిస్తూ ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పెద్ద సంఖ్యలో ప్రజలను భాగస్వాములు చేయడమే లక్ష్యంగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించిన ఐఎన్ఓ నేషనల్ కోఆర్డినేటర్ అనంత్ బిరాదర్ న్యూఢిల్లీకి ధన్యవాదాలు తెలిపారు.

పంచాయతీ అభివృద్ధికి భూమిని కేటాయించండి

నిమ్మనపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వెగంవారిపల్లి పంచాయతీ బాలినాయునిపల్లిలో ప్రభుత్వ భూమిని పంచాయతీ అభివృద్ధికి కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. శనివారం గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ సమీపంలో కేందూరు రోడ్డు పక్కన వున్న సర్వే నెంబరు 810-3వ లెటర్‌లో దాదాపు 15సెంట్ల ప్రభుత్వ భూమి వుందన్నారు. గతంలో ఇక్కడ తాగు నీటి ట్యాంకు వుండగా అది శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని రెండేళ్ల కిందట తొలగించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఓ టీడీపీ నేత ఆస్థలంలో అదే గ్రామానికి చెందిన చాకలి రఘుకు పట్టా ఇప్పించాలని ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. కాగా సర్పంచ్ శ్రీవాణి ప్రజల సౌకర్యార్థం తాగునీటి సమస్య తీర్చేందుకు ఆ స్థలంలో వాటర్‌ప్లాంట్, బస్‌షెల్టర్ ఏర్పాటు సన్నాహలు చేశారు. అయితే కొందరు టీడీపీ నేత ఆ స్థలం ఆక్రమించుకోవాలని చూస్తున్నారని వారం రోజుల కిందట కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సంప్రదిస్తే ఆయన గ్రామస్తులే వారి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారన్నారు. స్థానిక వీఆర్వో ప్రవీణ్ కుమార్ కూడా టీడీపీ నేతలకు వత్తాసుపలుకుతున్నారు. ప్రభుత్వ భూమి కబ్జాకాకుండా పంచాయతీ కేటాయించి అభివృద్ధికి దోహదపడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'సూపర్ సిక్స్ పథకాల అమలు లేదేమి...?'

మదనపల్లె టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా సూపర్ సిక్స్ పథకాల అమలు లేదేమంటూ నియోజకవర్గ కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్ ధ్వజమెత్తారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో రైతులు, మహిళలు, యువతకు పెద్దపీట వేస్తామన్నారు. మదనపల్లె మెడికల్ కాలేజిని అటకెక్కించారని, బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అసలు ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం పథకం, అన్నదాత పథకాలపై ప్రభుత్వం నోరు విప్పకపోవడం విడ్డూరంగా వుందన్నారు. మదనపల్లెను జిల్లాగా ప్రకటిస్తామని స్వయాన చంద్రబాబు, నారా లోకేశ్ చెప్పినా ఇంత వరకూ కార్యాచరణ లేకపోవడం చూస్తే అనుమానాలు రాకపోవన్నారు. ఇప్పటికైనా మదనపల్లె కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని రెడ్డిసాహెబ్ డిమాండ్ చేశారు.

నీలినాలుక టీకాలపై అవగాహన అవసరం

రాజంపేట టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల్లో నీలినాలుక వ్యాధిపై కాపరులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. శనివారం రాజంపేట మండలం హెచ్.చెర్లోపల్లె, గొల్లపల్లె గ్రామంలో నీలినాలుక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ గొర్రెల్లో నీలినాలుక వ్యాధి లక్షణాలను, టీకాల ఆవశ్యకతను తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.రాజంపేట ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్, హెచ్.చెర్లోపల్లె పశువైద్యాధికారిణి డాక్టర్ కె.భాగ్యవతి, జూనియర్ వెటర్నరి ఆఫీసర్ ఎం.వరదయ్య పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం

తంబళ్లపల్లె, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందని డీఎల్‌డీఓ అమర్‌నాథరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు పాఠశాలల్లో యోగాంధ్ర నిర్వహించారు. అధికారులతో కలసి యోగాసనాలు వేసిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పని ఒత్తిడితో ప్రజలు మానసిక రుగ్మతలకు లోనై వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. దీన్ని అధిగమించేందుకు ప్రతి రోజూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్ఎంలు రెడ్డప్పరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా దినచర్యలో భాగం కావాలి



సామూహిక ప్రదర్శనలో అధికారులు, ఉపాధ్యాయులు

కలకడ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ యోగా దినచర్యలో భాగం కావాలని మండల ప్రత్యేకాధికారి భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం బాటవారిపల్లె హైస్కూల్‌లో యోగాపై సామూహిక ప్రదర్శన నిర్వహించారు. 21న జరిగే కార్యక్రమంపై ముందస్తుగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరిబాయి, ఎంపీడీఓ అబ్దుల్‌రహీం పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం

తంబళ్లపల్లె, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలుచేస్తోందని పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచారని, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలు చేయబోతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం కుటుంబంలో ఒక్కరికే అమ్మఒడి ఇచ్చిందని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ రూ.13 వేలు చొప్పున తల్లుల ఖాతాలో జమ చేసి మాట నిలుపుకొన్నారన్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రభుత్వంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి సారథ్యంలో అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ఏడాదిలోనే నియోజకవర్గంలో రూ.300కోట్లతో అభివృద్ధి పనులు జరిగినట్లు వివరించారు.

మురుగును తొలగించరా..?



వాల్మీకిపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ రోడ్డు వాల్మీకి నగర్ ప్రాంతంలో మురికినీటి కాల్వలు దుర్భరంగా తయారయ్యాయి. నివాసాల నుంచి వచ్చే మురికినీరు సైతం కాల్వల్లో పేరుకుపోవడం, ఈ ప్రాంతంలో కనీసం పారిశుధ్య కార్యక్రమాలు కూడా చేపట్టడం లేదని, తమ ప్రాంతం నుంచి వెళ్లే కాల్వల్లో మురుగు పేరుకుని దుర్వాసన వెదజల్లుతూ రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ ఈఓ రవీంద్రనాథ్‌ను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టి నివాసాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

వెటర్నరీ ఏడీగా విశ్వేశ్వరరెడ్డి



వాల్మీకి పురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ ఏడీగా డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ నీరజ మదనపల్లె సహాయ సంచాలకులు కార్యాలయానికి బదిలీ అయ్యారు. మదనపల్లె సహాయ సంచాలకుల కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న విశ్వేశ్వరరెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురం పరిధిలోని పాడి రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిస్తానన్నారు. చింతపర్తి, గండబోయనపల్లె, విఠలం, తదితర ప్రాంత రైతులు విశ్వేశ్వరరెడ్డిని కలిసి సన్మానించారు.

వేడుకగా జాతర్లు



ప్రత్యేక అంకరణలో బోయకొండ గంగమ్మతల్లి

నిమ్మనపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సామకోటవారిపల్లి, నల్లగొండ, ఆరిపిరెడ్డిగారిపల్లి, యర్రమాలపల్లి గ్రామాల్లో శనివారం బోయకొండ గంగమ్మ, లాభాలమ్మ జాతర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, భాజాభంత్రీల మధ్య మహిళలు దీలు బోనాలు మోశారు. అనంతరం అమ్మవారికి తెల్లవారు జామున ఆగారం ఇచ్చి పండగను వేడుకగా చేసుకున్నారు. గ్రామాల్లో గంగజాతర్లు జరుగుతుండం తో బందుమిత్రులు, స్నేహితుల రాకపోకలతో గ్రామాలు కలకలలాడాయి.

నేడు ఉచిత వైద్యశిబిరం

మదనపల్లె టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక లయన్స్ కంటి ఆస్పత్రి వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఏసీడీఎస్ గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. కంప్యూటరైజ్డ్ కంటి పరీక్షలు, బీపీ, మధుమేహం వున్న వారికి రెటీనా చికిత్సను ప్రముఖ వైద్యులతో నిర్వహిస్తామన్నారు. పట్టణ ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

'తల్లికి వందనం'లో కోత తగదు

మదనపల్లె టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంలో ప్రతి విద్యార్థి నుంచి రూ.2వేలు కోతలు పెట్టడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తప్పుపట్టారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇలా కోతలు పెట్టడం వలన 9లక్షల మంది విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. రూ.3లక్షల ఆదాయం వున్న కుటుంబాలన్నింటినీ ఈ పథకంలో అర్హులుగా చేర్చాలన్నారు. ముఖ్యంగా స్కీం వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్లు, అందరిపిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వైభవంగా వసంతోత్సవం

పుల్లంపేట జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పర్వతవర్ధినిదేవి శాంతిలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతులను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి వసంతోత్సవం నిర్వహిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

పెనగలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం జరిగిన వసంతోత్సవం, ధ్వజారోహణంతో వైభవంగా ముగిశాయి. 10 రోజులు హరికథ, ఈవెంట్స్ ప్రజలను ఆకట్టుకున్నాయి.